UNIVERSAL
LIBRARY
OU_204719
LIBRARY
UNIVERSAL

శ్రీరస్తు.

అవిమారకము

(భాసకృతము)

మా. రామకృష్ణకవి, ఎం. ఎ.

గారిచేఁ దెనిఁగింపఁబడినది.

16.

వ్యాఖ్యాసంకలితము.] [వెల 0—10—0.
వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
[illegible], చెన్నపట్టణము. 192[illegible]

Printed through the Publishing Agents,

H. V. KRISHNA & Co.

Chintadripet, Madras.

ఉపోద్ఘాతము

కేరళదేశ లక్ష్మియింట నిరుద్ధశోభాగము లయియుండిన భాసకృతిరత్నములు వెలువడి పండితకర్ణపరిష్కారము లగుచుండుట పెక్కండ్రకు విదితమే కదా. ఇంచుమించుగా నైదుసంవత్సరములకుఁ బూర్వము స్వప్నవాసవదత్త ప్రతిజ్ఞాయౌగంధరాయణముల మాత్రము తాళపత్ర ప్రతుల సంపాదించి వాని రససంపదకు మెచ్చి తెనిఁగించి యుంటిని. ఇటీవలఁ గార్యాంతరముగాఁ గేరళదేశమున కేతెంచి తక్కుం గల పదునొకొండు రూపకములఁ జదివి యభూతపూర్వమగు నానందమును జెంది వానినెల్ల నల్పకాలములోఁ దెనిఁగించితిని. నేనెన్నఁ డాంధ్రీకరణమునకు దొరకొనఁ గోరకున్నను భాసరూపకములఁ బఠుపాత్రము సెంది యమ్మహాకవికి భక్తిపూర్వకముగా నర్చనాకుసుమములఁ బడసి పైచినట్లు భావించి యికార్యమునకు సమకట్టితిం గాని గీర్వాణభాషలో నాకుఁగల యత్యల్ప పాండిత్యముచే నిట్టిపని నిర్వహింతు నాయని యూహింపనైతి. నేటికాలమునఁ బెక్కండ్రు కవులు కాళిదాసాదులకృతులఁ దెనిఁగించి కరకౌశల మలవఱచుకొని మిన్నలయి యుండుటయు, వారలును భాసరూపకములఁ దెనిఁగింపఁబోవుటయు నెఱిఁగియు, 'నేరక యపకీర్తి జగతి నిలుపుటకాదే' యను సత్సూక్తి ప్రభావము గుర్తించియు నిట్లు సాహసించుట కేవల మాత్మవినోదార్థముకాని వైదుష్య స్పర్ధఁజేసి కాదు.

ఈరూపకములననుసరించి మూలముతోఁ జదివి చూడఁగా సుప్రసిద్ధులగు గాయనగాయనీ జనములకంఠధ్వనికిని ననువాదినీ యంత్రములలో

సుప్రతిల్లు రాగవిశేషమునకును గలయంతరమే నామనంబునకు స్ఫురించెను. అయినను జోశాంగనాకంఠమాధుర్యమును విననోఁచనిభావకుండు రవివర్మ చిత్రపటము కొని తేరలేక తేజోలేఖనమున సిద్ధమగు తత్ప్రతికృతులసౌందర్యమనుభవించు రసికునింబోలెనే ప్రతివాదినీయంత్రములవినుట సంభవించుఁగదా. అట్లె సంస్కృత భాషాభ్యాసము లేనికొందఱి కివియు నించుక రుచికరము లగునని తలంచుచున్నాను. నాయనువాదమున మూలాతిక్రమణము కొండొకచోట్లఁ గలుగుచుండును. అజ్ఞానవశమునఁ బెక్కుదోషములు నబద్ధములును బొందియుండును ఇరువది సంవత్సరములుగాఁ బద్యరచనఁ బరిత్యజించిన నాకిదియు దుర్ఘటమేయై యుండెను. కావున నిందుఁ బదబంధము పరుషమై యుండినఁ బండితులు క్షమింతురుగాక. కీర్తిసేన యనుకవయిత్రి.

"క. చిరకాల మెడసి క్రమ్మఱ
నరుదెంచిన యాలుఁబోలె నస్మత్కవితా
సరణి యనుకూలి గామియుఁ
దరతర మెడబాటుసేఁత తథ్యము మాకున్."

అన్నట్టులగునేమో.

దీనిలోని కథాభాగము బృహత్కథాది కృతులలో నెందును గానరాదు. ఇందుఁ గథానాయకుని విరహము శ్రుతపూర్వము గాక రసవిశేషమును స్ఫురింపఁ జేయుచున్నది. రసభావ విశేషము లిందు స్వభావోక్తికి లక్ష్యము లగుటయే యీరూపకమునకు జీవాతువు. కథాభాగపరిచయము లేకయె రూపకములఁ జూడనైనఁ జదువనైనఁ నొప్పని దీనిలోనికథను సంగ్రహముగానైన నీకుండుటకు భావకులు క్షమింతురుగాక.

మా. రామకృష్ణకవి.

శ్రీరస్తు

అ వి మా ర క ము

(నాద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును)

గురుకృప వార్ధినీట నొకకొమ్మునఁ దేలఁగ నుద్ధరించి, సం
గరమున దైత్యుఁగూల్చి యొకకాలను చిమ్మి పరిగ్రహించి, యా
దరమున బాహువంగొని సుదర్శనరక్షితఁ జేసి, పొందు ని
ద్ధర నసురారి నీ కొసఁగుఁ దాల్చినఛత్రమునీడ నిల్వఁగన్!

సూత్ర-(తెరవంకఁజూచి) ఆర్య! ఇటురమ్ము!

నటి - (ప్రవేశించి) ఆర్య! ఇదిగో యున్నాను.

సూత్ర - ఆర్యా, నీ యంతర్గతభావము నీ వదనజనితకౌతూహలస్మితముచేతనే యెఱింగితి; ఏమో చెప్పఁబోయెదవు?

నటి - నీ విట్టిభావజ్ఞుఁడవనుట యేమి యాశ్చర్యము!

సూత్ర - అట్లయిన యభీష్టముగాఁ జెప్పుము.

నటి - అయ్యతోఁగూడి యుద్యానవనమునకుఁ బోఁగోరెదను. నా కక్కడ స్త్రీలు చేయుకార్య మొకటి కలదు.

(తెరలో)

భూతిక, నీవును కురంగీరక్షణార్థ ముద్యానమునకుఁ బొమ్ము. అంజనగిరికి మదము పట్టియున్నది కదా.

సూత్ర - ఆర్య, వింటివిగదా "రాజపుత్రి యుద్యానమునకుఁ బోయె" నని. కావున నిప్పు డుద్యానవనము నలువంకలు ద్వారబద్ధమయి యుండును. రాజసుత మఱలి పోఁగానే మనము స్వేచ్ఛగాఁ బోవుదము.

నటి - చిత్త మార్యపుత్ర.

(నిష్క్రమింతురు)

అ వి మా ర క ము

ప్ర థ మాం క ము

(రాజు పరివారముతోడఁ బ్రవేశించును.)

రాజు-

ఉ. జన్నము లే నొనర్చితిఁ బ్రసన్నులు నాదెస బ్రాహ్మణాళి వే
యన్నిఁ రాజకోటికి భయంబన నిట్టిది నాఁగఁ జూపి య
త్యున్నతి నేలు నా కకట! యుల్లములోఁ బ్రమదంబు లే దిటన్
గన్నెలు గల్గుతండ్రులకుఁ గల్గు విచార మనేకభంగులన్!

కేతుమతి! పోయి దేవిం దోడ్తెమ్ము.

ప్రతీ - ప్రభూ! చిత్తము. (నిష్క్రమించును).

(పరివారముతో దేవి ప్రవేశించును.)

రాజు - దేవీ, నీముఖము నిత్యప్రసన్న మయ్యు నిప్పు డతి ప్రసన్నముగాఁ గానవచ్చుచున్నది. ఈప్రహర్షమున కేమయ్యెను?

దేవి - కురంగీనిమిత్తము దూత వచ్చెనని మహారాజుగారు చెప్పినవారు కారా? కావునఁ ద్వరలో నల్లునిఁ జూడ వచ్చునని—

రాజు - అట్లే యున్నది. అయిన నింకను నిశ్చయము కాలేదు. ఇటుఁ గూర్చుండుము.

దేవి - మహారాజ, చిత్తము. (కూర్చుండును).

రాజు - దేవీ! వివాహ మనఁగా ననేకపరీక్షలు చూడవలసి యున్నవి; ఎందుకనఁగా,

గీ. తండ్రి యల్లునిసంపత్తిఁదలపకుండ
నిచ్చచొప్పునఁబడి కూఁతు నిచ్చెనేని
మదముచే రెండు కులముల మాపు నదియు
క్షుబ్ధజలనది యిరుదరిఁ గూల్చునట్లు.

ఏమీ - శబ్దమువలె నున్నది! పెక్కుకారణములవలనఁ బుట్టవచ్చును. ఇదె——

క. కలకలము చాలదవ్వునఁ
గలిగియుఁ బెల్లగుటఁజేసి కనఁదగు నికట
స్థితిఁబోలెఁ బెక్కుతెఱఁగులఁ
గలుగంజనుఁ గాని శంక గలుగుఁ గురంగీ.

దేవి - మన కుమారిత యుద్యానమునకుఁ బోయియున్నదిగదా!

రాజు - ఎవ్వఁ డక్కడ?

భటు - (ప్రవేశించి) మహారాజ, జయము. ఇతఁడె యార్యకౌంజాయనుఁడు. ఏమో నివేదించుటకు వచ్చియున్నాఁడు.

రాజు - త్వరగాఁ బ్రవేశపెట్టుము.

భటు - మహారాజ, చిత్తము. (నిష్క్రమించును).

(కౌంజాయనుఁడు ప్రవేశించును)

కౌం - (నిర్వేదముతో) అయ్యో! మంత్రిత్వమనఁగాఁ గష్టము ఏలనఁగా——

ఎత్తినపూఁపు సిద్ధి యగునేని జనంబులు రాజుశక్తికిం
మెత్తురు, రిత్తయై చెడిన మిక్కిలి మూఢులు మంత్రు లంచు వా
క్రుత్తురు, మాయమాత్యులని గొప్పఁగఁ జెప్ప నరేంద్రు లాత్మలన్
మ త్తగుఁ గాని బుద్ధిబలమత్తుల కియ్యవి సూక్ష్మదండముల్!

జయసేన! స్వామి యెచ్చట నున్నాఁడు? ఏమి చెప్పుచున్నావు—ఉపస్థానగృహములో ననియా—అయిన నాప్రదేశమునకు నిశ్శంకముగాఁ బోవచ్చును. (పరిక్రమించి సంభ్రమముతో) ప్రసాదము, ప్రసాదము, స్వామీ!

రాజు - సంభ్రమము వలదు వలదు. స్వేచ్ఛగాఁ గూర్చుండి వృత్తాంతము చెప్పుము.

కౌంజా-స్వామి, వినుఁడు; నాతోడ మీరు చెప్పితిరిగదా దేవర కుమారికతోడ నుద్యానమునకుఁ బొమ్మని?

రాజు - అగును, మఱియేమి?

కౌంజా - కావున నుద్యానమున కేఁగి యథాసుఖముగాఁ గ్రీడించి రాజసుత వచ్చుచుండఁగా దాసీదాసహసితకథితశ్రవణబృంహితమదస్రవన్మదజలార్ద్రిదుర్దినాననుఁడును, నిహితపతితసాదిపురుషుఁడును, క్షితిరజోవగుంఠితావ్యక్తభీమమూర్తియు, మూర్తిమంతుఁడగుపవనుం బోలె దృష్టాదృష్టలఘుప్రచారుఁడై స్వామి సచివుల కేదో చెప్పఁదగినది తోఁచినట్లు, ఏకపురుషవిశేషమును దెలుపుదానివలె మదాంధత్వమున నాప్రదేశమునకు గజరాజు వచ్చెను.

రాజు - వి_స్తర మట్లుండుఁగాక. కురంగికిఁ గుశలమే?

కౌంజా-స్వామిభాగ్యము తెల్లమై యుండఁ గుశలిని కా కెట్లగు

రాజు - శుభము. ఇఁక యథేష్టముగా నుడువుము.

కౌంజా - అంతఁ బామరులు పాఱుచుండఁగా స్త్రీలు హాహా కారమాత్రప్రతీకారలు కాఁగా రాజభటులు సమీపించి హతులైరి. ఉద్యానమునకుఁ దెచ్చిన సర్వోపకరణములఁ బరీక్షింప ముహూర్తకాలము నేను నిలిచి నీతిచే దాఁగితి. ఇంతలో శీఘ్రముగా దేవరకుమారిక యానమునకే యేనుంగు సమీపించెను.

దేవి - ఇఁక నేమి కాఁబోవునోగదా !

రాజు - కురంగితోడ నెవరుండిరి?

కౌంజా - అంత నొకానొకదర్శనీ - (అర్ధోక్తితో నిలుపును)

రాజు - యథేష్టముగాఁ బల్కుము, వ్యాపదలు నిష్పరిహారములు.

కౌంజా - అంత నొకానొక దర్శనీయుండును, అవిస్మితుఁడును, తరుణుఁడు నయ్యు ననహంకారుఁడును, శూరుఁడు నయ్యును దాక్షిణ్యవంతుఁడును, సుకుమారుఁ డయ్యు బలవంతుఁడును, అగు నొకఁడు, ఏనుగుఁచేఁ బరిభవింపఁబడు దేవరకుమారికకుఁ దత్కాలదుర్లభ మగు సభ్య ప్రదానమిచ్చి నిర్విశంకముగా ద్విపవరము నొత్తెను.

రాజు - తనకారుణ్యమునకు ఋణము తీర్చుకొనెను. తరువాత

కౌంజా - తరువాత నతనిచే నలలితసరభసకరతలతాడనప్రదుష్టమై యాదుష్టగజము వేగముగా దేవరపుత్రిని వదలి యతనిం జంపఁగోరి యాదిక్కుగా మరలెను.

దేవి - అతనికి క్షేమ మగుఁ గాక.

రాజు - తరువాత!

కౌంజా-అంత వెనుక వచ్చినభూతికుఁడును నేనును దేవరకుమారికను మరల యానమున నెక్కించి త్వరగాఁ దోడ్తెంచి కన్యాంతఃపురములోఁ దెచ్చి విడిచితిమి.

రాజు - అహో, ఇది గొప్పప్రమాదము. అంత భూతికుఁ డేలరాఁడయ్యె ?

కౌంజా-భూతికుఁడు నాతో నిట్లనెను; "నీవు పోయి ప్రభువున కీవృత్తాంతమును జెప్పుము; నే నాపురుషునిప్రవృత్తియుఁ గులము నెఱింగి త్వరగా వత్తు" నని.

రాజు - అట్లయిన భూతికుఁ డంతయుఁ బరీక్షించి రాఁగలఁడు. కౌంజాయన! యాపరవ్యసనసహాయుఁ డేవంశమున జనించినవాఁడు ?

కౌంజా - స్వామీ! నే నంత్యజుఁడ నని తన్నుఁ దా మఱుగు పఱచుచున్నాఁడు.

దేవి - మహారాజ! అకులీనున కిట్టిజాలి కలుగునా ?

రాజు - అగునా యేమి ?

(భూతికుఁడు ప్రవేశించును)

భూ - (విస్మయముతో) అహో, పృథివిలో రత్నములు డాఁగి యున్నవి! మనస్స్వలవిక్రమబుద్ధులు నేఁ డీపురుషుని నిర్వ్యాజపరాక్రమముచే మందీభూతములవలె నయ్యె. నా కొకసంశయము కలదు. ఎందుకొఱకుఁ దన్నును దనకులంబును మఱుగుపఱచు చున్నాఁడు? లేక సూర్యునిఁ జేతితోఁ గప్పుట కెవ్వనితరము? ఇందే కదా!

చ॥ గురుజనశాసనంబున నిగూఢనిజక్రియ వేచియుండె స
త్పురుషులు రూపు మాటువడ భూమిఁజరింతురు పెక్కువెంటలన్
బరజనపీడ కెంతయుఁ గృపామతి నోర్వక కావఁగోరి త
ద్గురునియమంబుఁ దా మఱచితోతురు లోకమువారి కేగ్పడన్!

జయసేన! స్వామి యేప్రదేశమున నున్నాఁడు? ఏమి చెప్పెదవు—ఉపస్థాన గృహములో ననియా—అయిన నా ప్రదేశము శంకనీయము కాదు, కావున నందుఁ జొచ్చెదను. (ప్రవేశించి) అహో! మహారాజు దేవితో నిచ్చట నున్నాఁడు. (సమీపించి) మహారాజ! జయము.

రాజు - దేవీ! నీవు లోనికిఁ బోయి కురంగి నాశ్వాసింపుము. నేను నీవెంబడి నరుదెంచుచున్నాను.

దేవి - చిత్తము, మహారాజ! (నిష్క్రమించును).

రాజు - పరులకొఱకుఁ దనశరీర మాసింపని యాతనివృత్త మేమయ్యె?

భూ - స్వామీ! వినుఁడు, ముహూర్తము, అవలీలఁగా మెల్లగా సలలితముగాఁ బ్రియవయస్యునితోఁబోలె నా యేనుఁగుతోఁ గ్రీడించి నివర్తనానువర్తనగతివిశేషముల మోహింపఁజేసి తత్కార్మచే లజ్జితునివలె మహాజనప్రశంస నోర్వఁజాలక యవనతశిరస్కుఁడై స్వైరముగా స్వావాసమునకే యేఁగెను.

రాజు - ప్రీతి యయ్యె! ఇది నాకు రెండవలాభము!

భూ - అంత నాఁడుగజములతోఁ దానిఁ బట్టుకొని యీగజశాలకుఁదెచ్చి నేనాపురుషుని యన్వయప్రవృత్తు లెఱుఁగ నన్యాపదేశముగాఁ బోయితిని.

రాజు - ఏమి! నిశ్చయ మయ్యెనా? మేము చండాలుఁడని వింటిమి.

భూ - పాపము శాంతించుఁగాక. అట్టివాఁడు కాఁడు. ఏదో కారణమునఁ దన్నుఁ దనయన్వయమును గప్పిపుచ్చుచున్నాఁడు.

రాజు - నీ విఁకఁ బరీక్షించిన దేమి?

భూ - అందుఁ బరీక్షింపఁదగిన దే మున్నది?

గీ. రూపు దివ్యంబు, మాట విప్రోపమంబు,
సౌకుమార్యంబు బలము తేజంబు క్షాత్ర
మయ్యుఁ జండాలభావ మిం కగుసెయేని,
రిత్త యగు మాకు శాస్త్రపరిశ్రమంబు!

రాజు - అతనికిఁ గళత్రము గలదా?

భూతి - అంతయుఁ గలదు. కళత్రమును స్వయముగాఁ జూడ లేదు.

రాజు - ఒకవేళ స్త్రీదర్శనము పరిహృతమేమో! ఏలయతని తండ్రిని బరికింప వైతివి?

భూతి - సత్పాత్ర సంపన్నుఁడగు నతనిఁ జూచితిని. అతఁడు,

వాడవుఁ దనర్చ దీర్ఘతయుఁ బొంది భుజంబు లత్యుగ్రశపాంబులం
గడవులఁ జేసి యొప్పఁ బలిగింపగుణంబరివోసి వోసి క
ట్టడ యగుఁ గాయ కాచిన కడింది ప్రకోష్ఠము, సన్నఁడయ్యుఁ జో
ష్పగ నృపభావసుప్రవృత్తభా నునిభంగిఁ బ్రభ నుమేయాతఁడు.

రాజు - ఈప్రసంగము చాలును. మరల నిదియే పరీక్షింపఁ దగును.

భూ - చిత్తము, స్వామి!

రాజు - ఇఁకఁ గాశిరాజదూతవిషయమున నేమిచేయుదము?

భూ - స్వామి! నూఱుమంది దూతలు వచ్చిరి, రాఁబోవుచున్నారు.

క. ఇందు నున కేమి యుటఁ జే
యుందగుఁ గన్యాపిత్రుత్స్వ నుతివంద్యం బౌ
నందఱు రాజులు రాజను
తం దలఁతురు నల్లతతి పతాకయుఁ బోలెన్.

రాజు - నీయభిప్రాయ మేమి?

భూతి - అన్నిచోట్ల దాక్షిణ్యా ముంచరాదు. వారిలో గుణ బాహుళ్యము నలవియుఁ జూచి త్వరయు దీర్ఘసూత్రతయుఁ బరిత్యజించి దేశకాలవిరోధములు లేక కార్యము సాధింపఁ దగు నని యర్థము.

రాజు - భూతికునిమాట యుక్తమే. కౌంజాయన! ఏలయూరకున్నావు?

కౌంజా - స్వామి, క్షత్రియు లనేకు లున్నను వారిలోఁ బూర్వ సంబంధు లగుకాశిరాజసౌవీరరాజులు స్వామికి భగినీపతు లగుటం జేసి సమానులు, మనకు సంబంధయోగ్యు లని తమచే నూహింపఁబడిరి. అందులోఁ బూర్వమే సౌవీరరాజు తనపుత్రునకుఁగా దూతం బనిచియుండె. అతని, మనకన్య యతిబాల యని యుపదేశము చెప్పి, పూజించి పంపితిమి. ఇప్పుడును గాశిరాజు పుత్రునకుఁగా దూతం బంపియున్నాఁడు. వీరి బలాబల విచారములో దేవరయే ప్రమాణము.

రాజు - కౌంజాయనుఁడు చక్కఁగాఁ జెప్పెను. భూతిక! సర్వ రాజమండలమును వదలి యీస్థాపించిన యిరువురిలో నెవ్వనిదెస విశేషము గలదు?

భూతి - రాజులను భృత్యులు దూషింపఁజనదు. స్వామ్యమాత్యులకు వారును ప్రభువులేగ!

రాజు - ఈ యుపచారవాక్యము లట్లుండనిమ్ము; ఏమి నిశ్చయించితి, చెప్పుము.

భూ - ఇఁకఁ బ్రత్యాఖ్యానము చెప్పరాదు. స్వామి! సౌవీర కాశిరాజులు తమ భగినీపతు లనుటలో సమానులు, మఱి దేవిగారియన్న యగుట సౌవీరరాజు గుణాధికుఁడు.

రాజు - మాసంకల్పమును నీవును నభిమతింపనివాఁడవు కావు.

భూ - రెంటను నా కనుగ్రహమయ్యె.

రాజు - ఓయీ! ఏల మరల సౌవీరేంద్రుఁడు దూతం బంపక పోయె?

భూ - అందే నాకు సందేహము కలదు. చక్కఁగాఁ బరీక్షించి చెప్పెద మని యీవిషయ మెత్తనైతి.

రాజు - అతనికిఁ గుశలమే?

భూ - చారపురుషు లిట్లు చెప్పుచున్నారు—

గీ. ఆత్మజుఁడొకఁ డౌను నే మైన యరయఁగాఁడు!
నిర్వహింతురు మంత్రులె నీతిరీతులు
కారణం బన్న నొక్కింత గానరాదు
పరుల కింతి యగముఁ జొరఁ దగము గామి!

రాజు - హా! అతని కేమయి యుండును?

చ. మరునకు నగ్గమైనఁ గని మంత్రులు లోభగుణంబుతో మహీ
శ్వరుఁ గొలువట్టిరో! స్వజనసంగతి నాదృతిఁ గోరెనో ప్రజా
కురుఁ డయి! బ్రాహ్మణోత్తములు దూలి శపించిన శాంతికక్రియా
చరణముఁ బూనెనో! యిటుఁగ మాస్మభృదగారనిరోధహేతువుల్!

ఈ వృత్తాంతమును ద్వారగాఁ బరీక్షింపుము.

భూ - చిత్తము, స్వామీ.

రాజు - కౌంజాయన, ఇప్పుడీ కాశీరాజుదూతవిషయమున నేమి చేయుదము?

కౌంజా - ఇట్లే కాశీరాజదూతను బూజించి పంపవలయును. వివాహములు యథేష్టములుగా బహుముఖమున సాధింపఁబడుచున్నవి.

రాజు - అహో, మంత్రిబుద్ధి కార్య మపేక్షించుచున్నది కాని స్నేహమును బాటింపదు.

(తెరలో)

జయము స్వామి? జయము మహారాజ! పదిగడియ లయ్యెను.

భూతి - స్వామీ? తక్కినవిషయ మీనడుమఁ జింతింతము; స్నానవేళ మించుచున్నది; తమకుమారిక నాలడింప వలసియున్నది; మహాదేవియు నెదురు చూచుచుం డును; ఈ యుపద్రవమువలన మహాజనము సైతము స్వామిం జూడఁగోరును.

రాజు - అహో! రాజ్య మనునది మహాభారము, ఎట్లనఁగా;

సీ. తొలుతొల్త ధర్మంబుఁ దలపోసి మంత్రులబుద్ధిపోకల నాత్మబుద్ధినరసి
యనురాగరోషంబు లడఁచి కాలముచూచి మెత్తనపరుసంబులొత్తఁజేసి
పరచరనయనంబుబలిమి లోకానువర్తనములు రిపులరంధ్రములుఁ దెలిసి
యాత్మమండల మెప్పు డప్రమత్తతఁ గాచి బహుయత్నమునఁ దన్నుఁ
[బాదుగాచి

గీ. మఱియు భీమసంగ్రామంబు మలసె నేని
తృణముగాఁ దన్ను ననిమొన దిగ్గఁద్రోచు
వాఁడె పో భూమివిభుఁ డనువాఁడు వాని
బ్రదుకు కష్టంబు ప్రజ లెన్న భాగ్యశాలి!

(నిష్క్రమింతురు).

అ వి మా ర క ము

ద్వితీయాంకము - ప్రథమరంగము

(విదూషకుఁడు ప్రవేశించును)

విదూ - ఈ ప్రభుపుత్రు లనువార లవస్థావిశేషము నెఱుఁగరు! ఇఁక నీ యవిమారకుఁడు ఋషిశాపముచేఁ గులభ్రంశనమును జండాలకులప్రవాసమును నిజవిజ్ఞానమును గురుజనమును బాటింపక హస్తిసంభ్రమదివసమునఁ గుంతిభోజుని గూతుఁ జూచెనో నాఁటఁగోలె నా కన్యనివలె నయ్యెను. హీ! హీ! వే యేల? నాతోఁడ సల్లాపములఁ గోరఁడు; ఏవేళఁ జింతించుకొనుచుఁ దనలోఁ దానె క్రీడించుకొనుచుండు. 'గుంపుఁజొచ్చుట కొంప ద్రచ్చుట' అను లోకప్రవాదము సత్యమే యయ్యెఁ గదా! ఎక్కడి సంబంధము? ఆ రాజపుత్రిక తానంత్యజుఁ డని తెలిసియుఁ గోరుచున్నది. నేనును బ్రాహ్మణులనింద రానీయక బ్రాహ్మణగృహముల లోఁ దిరుగుచు మఱఁగు పఱచుకొనుచు నతనియింటికే పోవుచున్నాను.

(చేటి ప్రవేశించుచున్నది.)

చేటి - రాజకుల మిట్టియవస్థలోఁ బరిభ్రంశ మైనను జాలఁ బనిలేక నగరముఁ జూచుటకు వెడలితిని. ఓహో! ఇదె యార్యసంతుష్టుఁడు పోవుచున్నాఁడు. కానీ, వీనితోఁగూడ నవ్వులాడుచు ముహూర్తకాలము నిర్వేదము నపనయించుకొనెదను. ఓసీ, కౌముదీ! బ్రాహ్మణుఁడు లభించెనా? ఏమి చెప్పితివి? లభింపఁడనియా?

విదూ - చంద్రికా! ఇది యేమి?

చేటి - ఎవ్వనినైన బ్రాహ్మణుని వెదకుచున్నాను.

విదూ - బ్రాహ్మణుఁ డేల?

చేటి - వే తే మున్నది? నిమంత్రణభోజనార్థము!

విదూ - అమ్మా, నే నెవ్వఁడను! శ్రమణకుఁడనా?

చేటి - నీ వవైదికుఁడవుగదా!

విదూ - ఎట్లు నే నవైదికుఁడ? అయిన వినుము. రామాయణ మనునాట్యశాస్త్రము కలదు. సంవత్సరములోఁగా దానిలో నైదు శ్లోకములు నేను పఠించియున్నాను.

చేటి - తెలిసెఁ దెలిసె. ఇట్టి మేధావిభావ మయ్యగారికిఁ గులోచితమె.

విదూ - శ్లోకములు మాత్రమ కావు, వానియర్థము నైతము తెలిసికొంటిని. మఱియు వేఱువిశేష మొకటి గలదు.

అక్షరము నర్థమును దెలిసిన బ్రాహ్మణుఁడు దొరకుట దుర్లభము.

చేటి - అట్లయిన నీయక్షరమేమో చెప్పుము. (నామముద్రికను జూపును).

విదూ - (తనలో) తెలియక నే నేమని చెప్పుదును? (ఆలోచించి) కాని యిట్లు చెప్పెదను. (ప్రకాశముగా) అమ్మా! ఈ యక్షరము నా పుస్తకమునఁ గాన రాదు.

చేటి - నీ కిది తెలియకున్న దక్షిణ లేక భుజింపుము.

విదూ - కానీ, కానీ.

చేటి - అయ్యగారి యుంగురమును జూతము.

విదూ - చూడు, చూడు మిది రమణీయమైనది.

చేటి - (పుచ్చుకొని) ఇదె భర్తృదారకుఁడు, ఇటే వచ్చుచున్నాఁడు.

విదూ - (తిరిగిచూచి) ఎక్కడ, ఎక్కడ, అతఁడు——

చేటి - ముగ్ధబ్రాహ్మణుఁడు మోసపోయెను! ఇదె వంచించి యీ గుంపులోఁ దూటి చతుష్పథమార్గమునఁ బాటి పోయెదను. (నిష్క్రమించును).

విదూ - (కలయఁజూచి) చంద్రికా! చంద్రికా! ఎక్కడ? ఎక్కడ? చంద్రికా! హా! నేను మోసపోతిని! ఈ ముడుపుమారి లంజలశీల మెటిఁగియు భోజనాశచే మోసపోతిని! (పరిక్రమించి) భోజనముమాటస్సైత మబద్ధ

మే ల్లై యుండును. (ముందువంకఁ జూచి) అరే, ఇది పరుగెత్తుచున్నది! నిలు, ఓసిచెడ్డతొత్తా, నిలు నిలు. ఏమి? పరుగెత్తుచునే యున్నది! ఇఁక నేనును బరుగెత్తెదను. (పరుగెత్తుచు) నాపాదములు కలలో నేనుఁగుచేఁ ద్రొక్కఁబడినట్లు నచ్చటచ్చటనే జారుచున్నవి. ఆ! కానీ! ఈకుంభదాసి వృత్తాంతము నచ్చట వారికి నివేదించెదను. (నిష్క్రమించును).

ద్వితీయాంకము – ద్వితీయరంగము

(అవిమారకుఁడు కూర్చుండునట్లు ప్రవేశించును)

అవి—నేఁడును నాఁటివా స్తికర నిర్గత శీకరశీతలాంగిఁ బూఁ
బోఁడి ముహుర్భయాకులిత భూరివిలోలవిషాదనేత్ర నా
నాఁడినదృష్టి నిచ్చ్వడినం గలలన్ సతిఁ గాంచి మేల్కొనన్
బోఁడిగ సంస్మరింతు నిజపూర్వభవస్మృతివేది నాత్మునన్ !

అహో, అనంగుఁ డెంతబలవంతుఁడు! ఏ లనఁగా

ఉ. ఒల్లదు నాఁటఁగోలె మతియొండొకరూపముఁ జూడఁ జూడిక్కా, యీ
యుల్లము సంస్కృతిం దవిలి యూఁగుఁ బ్రసాదవిషాదడోలలన్,
దెల్లనవాఱు నెమ్మొగము, దేహము దయ్యక చిక్కఁబాఱు, నే
నల్లలనాడి యాడి పగ లార్తి, మునుంగుదు రాత్రి మూర్ఛలన్ !

లేక పురుషుల కధైర్యము యుక్తము కానేరదు. మదనుఁడు తలఁపఁ దలఁప విజృంభించుచున్నాఁడు. కావున నే

నిఁక సంకల్పింపక యూరకుండెదను. (స్మరించి) అహో! దాని రూపసంపద, రూపమునకుఁ దగిన యౌవనము, యౌవనమునకుఁ దగిన సౌకుమార్యము! ఇటనే,

మ. సలుపంబోలు విధాత యీగతిఁ బ్రతిచ్ఛందంబకా యౌవనో
జ్జ్వలదివ్యాంగల కట్లు వోల, దుదురా సౌదామినీకాంతు లీ
లలనారూపము దాల్చెనొక్కొ ! జలతల్పంబందు నిద్రింప బె
గ్గిలి కృష్ణుం డిగఁద్రావి యిక్కరణి లక్ష్మీదేవి యిం దున్నదో !

ఎట్లు నేను మరలఁ జింతింపఁదొడఁగితిని. ఇఁక నే నేమి చేయుదును? నామనస్సైతము నాయిచ్ఛలోఁ బ్రవర్తింపదు; ఇచ్చట,

క. మనసు నరికట్టి నిలిపిన
నొసరగ క్షణమేని యూరకుండదు, మగలం
జనుఁ జిరకాలము వల్లిం
చిన దుష్పారంబవోలెఁ జేగదు త్రోవన్.

లేక మనస్సును జయింప శక్యముగాదేమో! దానినే తలంచెదను. అహో! స్త్రీగుణములెల్ల నిచ్చటఁ బొందుపడి యున్నవి. (చింతాభిభూతుఁడై కూర్చుండును).

(ధాత్రియు నళినికయుఁ బ్రవేశింతురు)

ధాత్రి - (వితర్కించి) అహో, కార్యమెంత సంకటమైనది? ఇట్లు జరిగినచో రాజకులము దూషిత మగును. ఇట్లు చేయకున్న నామె తప్పక నశించు. నేననేకోపాయము లాలోచించితిని. నాకు నిప్పుడును, ఆమె మఱుఁగు పఱచుచునే యున్నది. లేక యామె యేమి మఱుఁగు

పఱచుచున్నది? నాఁటినుండి యామె సుమనావర్ణిక
ముల్లదు, ఆహారము రుచిచూడదు. గోష్ఠిజనముతోఁ
గ్రీడింపదు. దీర్ఘముగా నిట్టూర్పువిడుచును. అసంబద్ధ
ములు మాటాడును. చెప్పిన దెఱుఁగదు. గూఢముగా
నవ్వును, ఒంటరిగా నేడ్చును. రోగమును వంచించును.
కృశించుచున్నది. పాండుభావము పొందుచున్నది.
ఇందులో నొక యాశ్చర్యము; ఇట్టియవస్థా విశేషము
లతో నుండియు లజ్జ, భయము, కులమానము, బాల
భావము, వీనిచే నొకతెతో నైనఁ గొంచెమైన నాలో
చింపదు.

నళి - ఎందుకని చెప్పదు! నాతో నంతయుఁ జెప్పుచున్నది.

ధాత్రి - ఒసీ, నీయభిప్రాయ మెఱుఁగుదును. అవస్థ నెఱిఁగి
యెల్లవిధముల నతనితోఁ గూర్పవలయు ననుటయే.

నళి - కాక ఇట్టివా రట్టిగుణ విశేషములచే నకులీను లగు
దురా యేమి?

ధాత్రి - అచ్చటనే సందేహము? అమ్మగారి సమీపమున
మంత్రు లిట్లు చెప్పఁగా నేనును వింటిని, 'అది య
ట్టిది గాదు, ఏదో కారణమునఁ ద న్నంత్యకులజుఁడని
మఱుఁగు పఱచుకొనుచున్నాఁడు.'

నళి - అతఁ డెవఁడై యుండును?

ధాత్రి - అసందేహమే లేనియెడల నితనికంటె గుణశాలి యెవ్వఁడు లభించును ?

(తెరలో)

చ. కలిమియు రూపు సత్త్వమును జ్ఞానమునుం గులహీనులం దొగిం
గలిగినఁ గల్గుఁ గాక మఱి కల్గునొ శీలవిశుద్ధి వారికిం ?
గలుగు వినంగ నీకుఁ దగు కాలము వచ్చిన వీనివంశముం
గులగతశంకఁ బుచ్చి సమకూర్పు మభీష్టములైన కార్యముల్ !

ధాత్రి - ఓసీ, ఎవ్వఁడు పలికెను ?

నళి - ఇచ్చట నెవ్వఁడును గానరాఁడు.

ధాత్రి - నామేను గగురు పొడుచుచున్నది. నిస్సంశయముగా దైవమె పలికెను. ఇది కేవలము మానుష మని తలఁప.

నళి - అతనికులసందేహము వాసెను. మనమాట వినునా వినఁడా యని చింతించుచున్నాను. (చింతించి) వీని నున్మాదింపఁ జేయఁగల యారూపము ధన్య మైనది. వేయేల? వాఁడు మన్మథుఁ డైనను భర్తృదారికరూప ముఁ జూచి క్లేశింపక మానఁడు. కావున నతఁడును గ్లేశించుచుండు ననియే తలంచెదను.

ధాత్రి - ఓసీ, ఇదియె యతని గృహము. దీనికి నాఁడు హాస్తి సంభ్రమదివసమున కౌతూహలముతో వచ్చియుంటిని.

నళి - ఓసీ, ద్వారముఖ మెంతదర్శనీయమై రమ్మని పిలుచు చున్నది ! ఓసీ, రా, ప్రవేశింతము.

ధాత్రి - ఓసీ, భర్తృదారకుఁ డెక్కడ? ఏమిచెప్పితివి? చతుశ్శాలలోనున్నాఁ డనియా? (పరిక్రమించిచూచి) ఇతఁడె మన భర్తృదారకుఁ డొంటిగా నేమో చింతించుచు నున్నాఁడు.

నళి - ఓసీ, ప్రవేశింతము.

ధాత్రి - అట్లచేయుదము. (ప్రవేశించి) అయ్యగారికి సుఖము!

అవి - అహో, దానిరూపసంపద!

ధాత్రి - (ఆకులముతో) ఏమి కానున్నది? అయ్యగారికి సుఖము.

అవి - మ. స్తనభారాలస నయ్యురంబు జఘనోద్యద్భారఖిన్నంబొడల్

ధాత్రి - అమ్మో, ప్రలపించుచున్నాఁడు!

అవి - కను లార్చున్ సహజారుణాధరరుచా కల్లోల లీలాస్యమున్

ధాత్రి - ఇట్లున్మాదింపఁ జేసినయది ధన్యురాలే!

అవి - గనులం ద్రావఁగ నొప్పనేని యస్పృతాకారంబు భీతిల్లుచోఁ

ధాత్రి - కార్యము చక్కఁగా నున్నది.

అవి - దను వెట్లుండు రతాంతర ప్రచురమాద్య ద్విభ్రమాధీనమై!

ధాత్రి - ఆమెయే యితని నున్మాదించెను.

నళి - ఇతఁడును గ్లశించుచుండు నని చక్కఁగాఁ జెప్పితివి.

ధాత్రి - నీవు చక్కఁగా నెఱింగితివి! అయ్యగారికి సుఖము.

అవి - (చూచి సిగ్గుతో) మీకు స్వాగతము.

ఇరు - సుఖమే?

అవి - మీదర్శనము వలన సుఖమే కాఁగలదు.

ధాత్రి - అయ్యా! ఏమి యాలోచించుచున్నారు?

అవి - అమ్మా, శాస్త్రము చింతించుచున్నాను.

ధాత్రి - ఇంత యేకాంతమునఁ జింతింపఁదగిన యట్టిరమణీయ శాస్త్రము పేరేమి?

అవి - అమ్మా! యోగశాస్త్రము.

ధాత్రి - (స్మితముతో) శుభము పలికితివి, యోగశాస్త్రమే యగుఁగాక.

అవి - (తనలో) దీనివాక్యార్థ మేమి? అభిలాషవశమున నొకటి తలంచినను వే ఱొకటి చెప్పుచున్నాను. (ప్రకాశముగా) నీయభిప్రాయ మేమి?

ధాత్రి - యోగమును గోరియే మేమును వచ్చితిమి. అయ్యగారు యోగము ననుమతించిరనఁగానే రాజగృహమున మా యేకాంతావాసమునమాకును గార్యమునమకూరినట్లె. అచ్చటఁగూడ నొక రింతకు నధికముగ యోగమును జింతించుచునున్నారు. వారితోడనె యచ్చటనె చక్కఁగా యోగవిధానము తాము జింతింపఁగలరని.

అవి - ఎట్లింకను నాకుభాగ్యము రానున్నది? (ఆసనమునుండి లేచి), అమ్మా! నాప్రాణముల మరల నిచ్చినట్లున్నవి. ఏలనఁగా,

ఉ. కాంతమొగంబు సౌమ్యఫలకం బగు, నైనను జాలఁ దీక్ష్ణ, మ
త్యంతమనోజ్ఞ మయ్యును భయాకులదృష్టివిషోజ్వలంబు, నే

నెంతయుఁ జూడఁ జూడ మది కెక్కి వికారము వెట్టిపుట్టె మీ
కింతకు వచ్చి వాగమృత మింతియ చిల్కినఁ జేతరించితిన్.

ధాత్రి - తా మామె నెదురుచూచుట శుభమే యయ్యె. అతి ప్రసంగము నాకేల? కన్యాపుర మిప్పుడ చొరఁదగును. కన్యాపుర రక్షకుఁడగు నార్యభూతికుఁడు పూజించి పంపిన కాశిరాజు దూతతో మా మహారాజు సెలవు మీఁద బయలువెడలెను.

అవి - మంచిది, ప్రథమకల్పము. అమ్మా, ఎవ్వఁడాతురుఁ డౌషధమును బొంది మందీభూతుఁ డగును?

ధాత్రి - ప్రవేశముమాత్రము దుర్లభము; లోన చిరకాల ముండుటకు వలను గలదు.

అవి - లోనఁ బ్రవేశించిగదా యాలోచింపఁ దగు; ప్రాసాదమాలలో నర్గళములనెల్ల వదల్చియుంపుఁడు.

ధాత్రి - అట్లు గావించెదము. లోపలఁ జేయఁదగినవెల్ల సంపాదించెదము. అయ్యగా రప్రమత్తులై చొత్తురుకాక.

అవి - అమ్మా! రాజగృహవిధానముఁ జక్కగాఁ జెప్పుము.

ధాత్రి - ఈలాగు——

అవి - కానీ, పో.

క. విని రాజకులవిధానం
బనువుగ లోఁ జొచ్చినట్లు యాత్మకుఁ దోఁచెన్
అనుకూలదైవ ముండిన
జనులేమియు ననరు పౌరుషక్రియ సలుపన్.

(చింతించి) అమ్మా! మాకీకార్యమున నమ్మకమేది?
ఇరువురు - ఇదియె ప్రత్యయము; జయము, భర్తృదారక!
అవి - కానీ, ఇఁకఁ బోండు. అర్ధరాత్రము నెదురుచూచుచుండుఁడు.
ఇరు - చిత్తము. (నిష్క్రమింతురు)

(విదూషకుఁడు ప్రవేశించును)

విదూ - అహో, నగర మిప్పు డెంత శోభిల్లుచున్నది! సూర్యభగవానుఁ డస్తమించి దధిపిండపాండురము లగు ప్రాసాదములమీఁదను, అగ్రాపణములయందును తేనెయు బెల్లపునీరును గురియుచున్నాఁడు. గణికాజనులును, నాగరక జనులును, బరస్పర విశేష భూషణముల ధరించి తమ్ముఁ గానిపించుకొనఁ గోరి వారివారి మేడలపై విభ్రమముతోఁ జరించుచున్నారు. నేనో యున్మాదము నెందిన యతనితోడ నట్టివానిం జూచి నీ రాత్రి సహచరుఁడనయ్యెద నని నగరము వెడలివచ్చితిని. అతఁడును మా యధన్యతచే నేదో యొక యనర్థచింతనముచే నన్యునివలె నయ్యె. ఇదియె యతనిగృహము. ఇప్పుడె నగరాపణాళిందమున, నచ్చట నతనియిల్లు వెడలి రాజదారికదాదియు, సఖియు, వచ్చిరని వింటిని. వారి కక్కడఁ బనియేమి? లేక పురుషునిభాగ్యములు హస్తిహస్తమువలె సంచ

లించుచుండును. లేకమాకనర్థమే వచ్చెనో; రానిమ్ము. అవస్థానదృశమగురాజగృహముఁ జొచ్చెదను.(ప్రవేశించి) హీం - హీం - ఇదె - యతఁడు కాముకజనవర్గకముచేఁ బూయఁబడినట్లు పాండుభావముతో నిటు వచ్చుచున్నాఁడు. కాక సురూపుల కన్నియు నలంకారములె. (సమీపించి) అయ్యా! జయము.

అవి - వయస్య! నీవు నగరమునఁ జాలఁ దడసియున్నట్లున్నది.

విదూ - నీ విప్పు డామంత్రణవిప్రలబ్ధుఁ డగుబ్రాహ్మణునివలె నహోరాత్రము చింతించుకొనుచున్నావు! నేను పగలంతయు నగరము దిరిగి భోగము దొరకని ప్రాకృత గణికవలె రాత్రిఁ బ్రక్కను బండవచ్చుచున్నాను.

అవి - నీ కొకప్రియవార్త చెప్పెదను.

విదూ - ఏమి? మనకు ఋషిశాపము సమాప్తమయ్యెనా?

అవి - తప్పక కాఁబోవుదానిలో సంతోష మేది?

విదూ - ఇఁక మఱియేమి?

అవి - ఏమి! కురంగి దాదిని, నళినికఁ జూడకుంటివా?

విదూ - అగునయ్యా, వారిని జూచితిని; ఏమి తెచ్చిరి?

అవి - మాకు శోకౌషధము.

విదూ - అయినఁ జూతము.

అవి - సమయమునఁ జూతువు; ఇప్పు డిది వినుము.

అవి - చెప్పుఁడు, చెప్పుఁడు.

అవి - వేయేల, ఆమె యిప్పుడ కన్యాపురము ప్రవేశింపఁ దగు నని చెప్పెను.

విదూ - (నవ్వి) ఏయుపాయముచే నభ్యంతరముఁ జొచ్చి జీవము నిలుపుకొనఁ గోరెదవు? కుంతిభోజుని మంత్రు లనఁగా విషమశీలురు.

అవి - ఎట్లు నీకును శంకింపఁజను? చూడుు.

క. సమసిరి తమసేనలతో
విమతులు నాయొకనిచేత విడిచిరి దర్పం
బమరారి యవిసె నవిరూ
పమున న్నా భుజముచేత భరమే మనుజుల్.

క. తల యెత్తి రరులు నేఁడును
బొలిసిరి నాయొకనిచేత మొనలుం డారుణ్
దొలిఁజెడియె నవినిశాటుఁడు
తల మొట్టినఁ గిట్టి నరు లుదగ్రులె నాకుణ్.

విదూ - తెలియును. నీయమానుష కర్మముల నెఱుఁగుదును. కాని రాత్రితోఁ బరగృహప్రవేశ మెల్లవిధముల శంక నీయమే.

అవి - ఇది పరమార్థము, కుంతిభోజుని కన్యాపుర మెల్లవిధ ములఁ జొరవలసిన దే! మహాబ్రాహ్మణ! దాని కనుమత ముగాఁ బల్కుము.

విదూ - న న్నెట్లు విడచిపోయెదవు? నేను నిన్నెప్పుడును విడు వను. ఏడ్చుచున్నను గొనిపోవలసిన దే.

అవి - నీకు శాస్త్రమార్గము తెలియదు.

క. చోరజను జనునకుం బరమం
దిర మొక్కఁడ, మంతనంబు దీర్పఁగఁ దగు నొం
డొరుతోఁ బలువురితోడన్
నెరపందగుఁ గలను శాస్త్రనిర్ణయ మిదియున్.

కావున నేనొక్కఁడ కుంతిభోజుని కన్యాపురము చొరఁ జను. నీకు మాయందు సందేహమువలదు. చూడుము.

గీ. కుంతిభోజునిసేనల గుణము లేదు
విభవములఁ జేసి యవలీల విభుగృహంబుఁ
జొరఁగఁదగు భుజంబ యాయుధోత్కరము మాకు
నీవు శంకింపఁ బని యేమి నేస్తకాఁడ?

విదూ - ఇట్లు నీవు నిశ్చయించియున్న యెడల నే నిప్పుడ నగరమునకుఁ బోయెదను. నా కొక్కఁడ నొకమిత్రుఁడు గలఁడు. వానియింటిలోఁ బ్రొద్దు పుచ్చెదను.

అవి - నీవు బాగుగాఁ జెప్పితివి. ఇప్పు డభ్యంతరముఁ జొచ్చి యాహ్నికములఁ దీర్చుకొని మహారాజుగారి సెలవు మీఁద వాసగృహమున శయనసంవిధానముఁ జేరి యెవ్వ రెఱుఁగకుండ నగరము ప్రవేశించి నీ మిత్రగృహమునఁ బ్రొద్దుపుచ్చెదను.

(చేటి ప్రవేశించును)

చేటి - జయము, భర్తృదారక! స్నానోదకము సిద్ధమయ్యె.

అవి - ఇదె యిదె వచ్చితిని, ముందుగాఁ బో.

చేటి - చిత్తము. (నిష్క్రమించును.)

అవి - వయస్యా ! దివాకరభగవానుఁ డస్తమించెను. ఇప్పుడు-

క. తెరయఁగఁ జీకటితూర్పునఁ
బరఁగఁగ నెఱసంజకెంపు పడమటఁ దనరం
బర మొప్పె నర్ధనారీ
శ్వరశోభాకృతి ద్విధావిభక్తాంగంబై.

విదూ - నీవు చక్కఁగాఁ జెప్పితివి. పగలు దాఁటిపోయినది; ప్రదోష మెక్కెను.

అవి - అహో, లోకస్వభావ మెంత విచిత్రమైనది.

చ. నవతిలకంబు పోఁ దుడిచి, భ్రాజదుడువ్రజరత్నమాలికం
దివుట ధరించి, యాతపము దీఱ, మనోహరశీతవాతముల్
నవకము గాఁగ రా, విటజనంబు సెలంగఁ గడంగఁ జోరులు
త్సవమున, మర్త్యలోక మిదె తా నగు వేషము మార్చి వచ్చెనాఁ

(నిష్క్రమింతురు)

పాఠాంతరము.

గీ. ప్రాగ్దిశాభాగ మంధకారమునఁ బూసి, పరమదిక్కున మైఁ దాల్చి సంజకెంపు
రెండునగములఁ దగి యంతరిక్ష మొప్పె, పూని యర్ధనారీశ్వర రూపశోభ.

అ వి మా ర క ము

తృతీయాంకము - ప్రథమరంగము

(కురంగియు నిరువురు చేటికలును బ్రవేశింతురు)

కురం - ఓసీ, అతఁ డేమి చెప్పెను?

చేటి - భర్తృదారిక! ఎవ్వఁడు?

కురం - (తనలో) నిర్భాగ్యురాలను. నా హృదయము పగులు చున్నది. (ప్రకాశముగా) కన్యాపురచేటుఁడు.

మాగ - నేను వానిం జూచితిని; మాటాడితిని; ఏమియుఁ జెప్పఁడయ్యె.

కురం - అక్కటా! కన్యాపురచేటుఁడు నాకు శుకపంజరము చేసి యియ్యఁడని అమ్మకుఁ జెప్పియంపెదను.

మాగ - భర్తృదారికకుఁగా శుకపంజరము తెచ్చియున్నారము గదా!

కురం - వాచాటా! మఱియేమున్నది?

మాగ - కానీ.

కురం - ఓసీ, ప్రొద్దెంత?

మాగ - ప్రదోషము మునిఁగిపోయెను.

కురం - అట్లయినఁ బ్రాసాద మెక్కుదము.

మాగ - విలాసిని, ముందు పొమ్ము, శయనాసనములఁ గూర్పుము.

విలా - నీవు నిద్రించుచుంటివి! ఎప్పుడు శయనాసనములఁ బఱచితి నేమి ?

మాగ - ఓసీ, నీయలసత్త్వము నే నెఱుఁగుదును. పగలే కూర్చినవాని నిప్పుడు కూర్చితి ననెదవు.

విలా - ఓసీ, అట్లు చెప్పకు ; భర్తృదారికకుఁ గాక పెక్కులు గలవు.

మాగ - ఓసీ, పోయి యెఱింగెదను. (అందఱుఁ బరిక్రమింతురు)

మాగ - ఇదె ప్రాసాదము.

కురం - ముందుగాఁ బొమ్ము (ఎక్కుటను నటింతురు)

మాగ - బాపు, విలాసిని, బాపు! నీపేరునకుఁ దగినట్లు చేసితివి. ఈశిలాతలమునఁ బఱపు వైచితివి.

విలా - అభ్యంతర మండపమునను బఱపు పఱచితిని. మాగధికా! చూడు చూడు నాయలసత్త్వము!

మాగ - నీ వతిపండితురాల వైతివి ; ఇట్టి పండితచేటునిఁ బెండ్లాడుము.

కురం - ఓసీ, ఈ శిలాతలమున ముహూర్తము కూర్చుండెదను.

మా - భర్తృదారిక యభీష్టముచొప్పుననే ; కానిమ్ము.

(అందఱుఁ గూర్చున్నారు)

మాగ - భర్తృదారిక ! ఒకకథ చెప్పెదను.

కురం - నీయసంబద్ధ ప్రలాపము నాకుఁ దెలియును.

మాగ - భర్తృదారిక! కథ క్రొత్తది.

కురం - వేఁడుకొనెద, నన్ను నిర్బంధింపకుము ! ముహూర్తము పరుండెదను.

విలా - భర్తృదారిక సుఖముగా శయనించుఁగాక ; నాకుఁ జెప్పుము.

కురం - (తనలో) ఏమిగా నుండును ?

మాగ - ఓసీ, భర్తృదారికకు వలదు ; నీవు వినుము. (అని మెల్లఁగాఁ జెప్పును)

కురం - హుం, రహస్యము తెలిసె ; చెడితిని.

విలా - నీ వెక్కడ వింటివి !

మాగ - అమ్మగారి పరిచారిక వసుమిత్ర చెప్పినది.

విలా - అమ్మగారే స్వయముగాఁ జెప్పియుందురు.

మాగ - కాశిరాజపుత్రుఁడు జయవర్మ యనువాఁడు గలఁడు. అతనికి భర్తృదారిక నిచ్చినట్లు ; అతనిదూత రాఁగా మహారాజు పూజించెను. అతనిచిత్రపటమును సైతము పుచ్చుకొనెను.

కురం - (తనలో) ఇది యబద్ధము ; నామనస్సునకుఁ దోఁచుచున్నది.

మాగ - అప్పు డమ్మగారి ట్లు చెప్పిరి "నాకూఁతురు బాల; ఒకదినమైనఁ జూడలేకుండఁజాల; మహారాజునకు నాయం దనుగ్రహము గలదేని యిచ్చుటకే యల్లునిఁ బిలిపింతురుగాక" యని.

విలా - తరువాత,

మాగ - తరువాత మహారాజందునకును సమ్మతించి యిప్పుడ మంచినక్షత్ర మని దూతతో నార్యభూతికునిఁ బంపిరి.

కురం - (తనలో) అయ్యో! కార్యము కాలాంతరిత మయ్యె.

విలా - భర్తృదారికకు రూపయౌవనములు సఫల మయ్యెనని మాకుం బ్రియము.

నళినిక - (ప్రవేశించి) నాతల్లి యిట్లు చెప్పెను. "పోయి యీ వృత్తాంతమును భర్తృదారికకుఁ జెప్పుము; ప్రియ వార్తలు ప్రియులకుఁ జెప్పినప్పుడు ప్రియతరములగును. ఇఁక నదియు నన్నుఁ జూచి సర్వము నమ్మి చెప్పును. నేను సమయమున సమీపమునకు వత్తును" అని. కావున నీప్రియవార్త భర్తృదారికకుఁ జెప్పెదను.

(పరిక్రమించును)

కురం - ఏమి! నే నెన్నఁడును ననుభవించి యెఱుఁగని చింతా రోగము నన్ను వెఱ్ఱిదానిఁ జేయుచున్నది; పుష్పహారము నొల్ల; గోష్ఠి రుచింపదు; ఇది మనోహర మయ్యు దారుణమే; నళినికా, ఇది యేమి?

మాగ - భర్తృదారిక, నేను మాగధికను.

విలా - భర్తృదారిక, నేను విలాసినినే.

నళి - (సమీపించి) భర్తృదారిక! నేను నళినికను. సోపానశబ్దము చేతనే భర్తృదారిక యెఱింగియుండును. భర్తృదారిక! అమ్మగారిట్లు చెప్పిరి.

కురం - ఏమని?

నళి - ఇట్లని (చెవిలోఁ జెప్పును)

కురం - చారిత్రము హీన మగును.

నళి - ఇది సంభావనీయమె; అది యదియే.

కురం - నళినికా, దేహము నొత్తుము.

నళి - చిత్తము, భర్తృదారిక.

విలా - నళినిక, వివాహ మెప్పు డగును?

(తెరలో)

ఇప్పుడే.

నళి - చిరంజీవ.

(తెరలో)

రాజపురుషులారా! అమాత్యుఁడు వెడలిపోయెనని యతనిభృత్యులలో నొక్కఁడైనను గన్యాంతఃపురరక్షణార్థము వచ్చినవాఁడు కాఁడు. మీయిష్టానుసారము చేయుఁడు, నేను రేపు రాజునకు దీని నివేదించెదను.

విలా - ఓసీ, నళినికా! ఏమని వినవచ్చెను?

నళి - ఎప్పు డాభర్తృదారకుఁడు ప్రవేశించునో యప్పుడ వివాహము.

విలా - అవిఘ్నముగాఁ బ్రవేశించుఁగాక.

నళి - అట్ల యగుఁగాక.

మాగ - ఓసీ, రమ్ము చతుశ్శాలలోఁ గూర్చుందము.

విలా - అట్ల కానిమ్ము. ప్రదోషము గడచిపోయెను. వెన్నెల యెక్కెను.

నళి - ఓసీ, నాకు నాసన మేర్పఱుపుము.

మాగ - అవకాశ మున్నది. నిద్ర పోవువఱకును భర్తృదారికను సేవించుచుందుము.

నళి - అట్ల కానిమ్ము. (ఇరువురు నిష్క్రమింతురు)

(అవిమారకుఁడు చోరవేషముతో ఖడ్గహస్తుఁడై రజ్జువుతోఁ బ్రవేశించును.)

అవి - (విమర్శముతో) హా! తారుణ్య మనునది యెంతకష్టము. ఏలనఁగా,

ఉ. వైకొను రాగముం బెనుచుఁ, బాల్పడఁ ద్రోయుఁ బ్రమాదవృత్తికిన్,
దూకొను సాహసక్రియకు, దోషవిచారము సేయ నొల్లఁ డే
పోకలనైన మైమెయిన పోవు, గణింపదు నీతిమార్గమున్,
బోకడఁ బెట్టుఁ, బెద్ద లొకపోఁడిగఁ జెప్పినబుద్ధు లేనియున్.

ఎందున కాత్మాధీనము లగు నర్థముల నిట్లు మందుఁడ నగుచున్నాను! ఇక్కడ,

చ. పురమునలేవు నా చననిపోకలు, రక్షులసార మెల్ల నె
ల్లరకును దెల్ల మీ తపములావున నద్దమరేయు భీష్మ మై
నెరసె, సహాయ మీ యసియు, నిశ్చితనిష్ఠిత మంతరాత్మయున్,
బరిపరిభంగు లేల తలఁపం, గలవే యిఁక దుష్కరార్థముల్:

అహో, అర్ధరాత్ర మెంత ప్రతిభయము! ఇప్పుడు.

మ. ఘననిద్రారసమోహమగ్నులు జనుల్ గర్భస్థులుంబోలెఁ, జెం
దెనొ ధ్యానస్థితి నాఁగ మేడ లెసఁగున్ నిశ్చేష్ట నిద్రాసుఖ
జ్జనమై, చీఁకటి కూరి ప్రమింగెనొకో! నా స్పర్శానుమేయంబు ల
య్యె నగంబుల్ జగ మెల్లరూపు మఱుఁగయ్యెన్ మాయమై డాఁగె
[నాన్.

ఇప్పుడే కాళరాత్రి వర్తించుచున్నది.

ఉ. పాంజెడునో తమశ్చయము పాథము గాఁ బురమార్గనిమ్నగల్,
మీటి తుఱంగలించుబలు మేడలపంక్తులు సైకతాళి గాఁ
దీటినచీఁకటిం బదియుదిక్కులు రూపులు మాసి మున్గె నీ
దాటినయంధకారమును దాఁటఁగఁ దెప్పకుఁగాక శక్యమే.

(పరిక్రమించి చెవి యొగ్గి) హో, గాంధర్వధ్వనివలె విన వచ్చుచున్నది. ఎవ్వఁడు వీఁడు సర్వకాలముల సుఖముగాఁ బ్రియురాలితో గాంధర్వము ననుభవించుచున్నాఁడు. తెలిసె, తానె స్వయముగా వీణ వాయించుచున్నాఁడు. ఏలనఁగా,

క. పొడ వగు హర్మ్యము, జాలము
లడఁచిరి, తంత్రీనినాద మను నాదముతో
ముడివడు, బాహ్యస్థానము
కడుబయ, లిటు మీట స్త్రీనఖంబుల వశమే?

అయినను గీతముమాత్రము స్త్రీయది, ఏలనఁగా,

క. మందమయి విశదమయి రహిఁ
బొందుం దానంబు, గలిగె ముఖనాసిక సు
స్యందమయి నాద, మింకయుఁ
జెండెంగంకణరవంబు, చేతాళముతోన్.

(పరిక్రమించిచూచి) హాహాహా! వీఁడు వేటూకఁ డెవ్వఁడో దయితం బుజ్జగించుచున్నాఁడు. వీని యపరాధము గొప్పదే యైయుండును; ఇంతప్రౌఢయయ్యు నీమె వీనిచే నూఱడ గొన్నది గాదు. కాక ప్రసన్నురాలైయె యీ వ్యపదేశమును గోరుచున్నదో యేమో? ఏలనఁగా,

ఉ. త్రువ్వెడు బాష్పబిందువులతో జడగద్గదజిహ్మకంఠయై
యెవ్వతె నీకు నే ననుచు నించుక పల్కు నిగూఢరాగయై,
యవ్వనజాక్షి తాఁ బ్రియుని కగ్గమ యయ్యు నుదారభావతన్
జివ్వలమాటలే పలుకు స్త్రీయగుటం బ్రతికూలవాదనన్.

భైరవస్వరము గలిగించు నీ పక్షి యేది——? అగును; ఇదిగుడ్లగూబయే. ఎట్లిది నవ్వె? ఉలూకస్వరశ్రవణభీత యై యికాంత తాన వీనిం గౌఁగిలించికొనియె! వయస్సునకుఁ బరవ్యాపారములఁజూచుట ధర్మమా యేమి? కావునఁ గడచి పోయెదను. (పరిక్రమించి) ఎవ్వఁడు వీఁడు నగరపుటంగడిముంగిట శంకతో నతిస్నిగ్ధముగ మాటలాడుచున్నాఁడు? వీఁడు మన బ్రహ్మచారియే కాఁబోలు.

చ. పరిజన మెయ్యె నాడు మని బాధయొనర్పు, విభూషణాళిచే
బెరసిననిస్వనంబు విని బెగ్గిలుఁ గామశరాభిభూతుఁడై,
నెరయికలేనికూటమి గణించు, మఱుంగులె కోరుఁ, బ్రేయసిన్
బొరసి ప్రియంబునై నెదురుపోవఁగ నొల్లఁడు, జారుఁడయ్యెడున్.

(పరిక్రమించి) అయ్యే, వెన్నెల వచ్చెను. హాఁ, వెన్నెల కాదు. ఇది యుభయపార్శ్వగత ప్రాసాదముల గవాక్షాంతర్గత మగు దీపప్రభయే. ఇటఁ బ్రయత్నముతో నాత్మ రక్షింపఁ దగును: అహాఁ, వీఁడె దొంగ; వీఁడు,

గీ. సుదృఢపరికరములు దాల్చి ముదముతోడఁ
బరగృహంబున మాటలు పట్టివినుచు
వేగఁ బోవుచు దివ్వెలవెలుఁగుఁ జూచు
నడుగుచప్పుళ్ళ కెంతయు నాత్మనులుకు.

కానీ, వీని వదలిపోయెదను. (ఏకాంతముగా నిలచి) నృశంసుఁడు పోయెను. ఇఁక మనపని చూతము. (పరిక్రమించి) అహాఁ! వీరు రక్షిపురుషులుగదా? ఇప్పు డేమి చేయుదును? కానిమ్ము, తోఁచెను! ఇదె శృంగాటకమున నుండు విటసభం జొచ్చెదను. (దాఁగియుండి)

గీ. రాజపురుషుల మితపరాక్రములఁ జూచి
దాఁగఁ జనునన్న నాదు ఖడ్గంబె నవ్వు
రక్షిపురుషుల నోర్వ భారంబు గాదు
కార్య మీడేర్పఁ జొచ్చితిఁగాక యిందు

రక్షులు పోయిరి. ఎవ్వరి కెవ్వరు రక్షకులు; నన్ను నేను రక్షించుకొన్నప్పుడు!

క. ఒగి వీరవరులు వడయని
మగటిమి నిశి రాగలోభమదమోహయుతుల్
తెగుదు రిటఁ బురుషకారమె
తగదుట విషమంబు సుఖము నిశివిహరణముల్.

ఇదియె రాజకులము. ప్రాకార మెంతగట్టిగాను బొడ్డుగా నున్నది! ఇక్కడఁగదా పురుషులకుఁ గక్ష్యాబంధము ప్రయోజకమగును! లేక ప్రవేశించినపిదప నాలోచించెదను. కపిశీర్షకములు గట్టివే! ఇచ్చట నిలచి త్రాడువైచెదను. 'నమః ప్రజాపతయే నమః సర్వసిద్ధేభ్యః ప్రసీదం తు బలిశంబరమహాకాలాః విజృంభతాం రాత్రిః! వర్ధతాం నిద్రా, అనుమన్యతాం పద్మా, లయంగతాః సర్వవిఘ్నాః భవంతు, హతాః పరిపంథికా భవంతు, జయతు భగవతీ కాత్యాయనీ!' (త్రాడువైచి) హాహా! కపిశీర్షకమునకుఁ ద్రాడు తగులుకొనియె. అహో, భవితవ్యప్రభావము! ఒక్కమాటు వైచినంతనె చక్కఁగాఁ దగులుకొనుట కార్యసిద్ధి యని కానవచ్చుచున్నది. అహో భగవత్ప్రజాపతి యెంత బలవంతుఁడు! ఏలనఁగా,

చ. తొడరుట మేలు కార్యములు దోషము లేవొనఁగూడకుండినన్,
బడయఁగఁజాల దీని నని బాలిశుఁ డైనను బున్కి సేయునే,
కడఁకల మేలుగాఁ బురుషకారము సెల్లఁగ మానవుండు సే
సెడు, నటఁ గార్యసిద్ధియును జేకుఱు దైవము చక్కఁజూచినన్.

కానీ, త్రాడు పట్టుకొని యెక్కెదను. (ఎక్కిచూచి) అహో, రాజకులసంపద!

మ. విపులం బయ్యు మితోపమంబు, నిబిడస్ఫీతంబు కక్ష్యావళీ
స్ఫుటం బాటఁ, గ్రమోచ్ఛ్రితం బగుటఁ బ్రాప్తశ్రీమహాన్నత్య మై
నృపదీవ్యద్భవనోత్తమం బలరెడున్, నిస్సంఖ్యహర్మ్యావళిన్
విపులాక్రాంతి యొనర్చి నాకముఁ గొనన్ వేలంబువెట్టించె నా.

ఇచ్చట నుండఁజనదు. అట్టాలప్రతోళీంద్రమహాముల వలన సర్వవిఘ్నము లగు. కానీ, ఈత్రాటితోనే డిగియెదను. (డిగి) ఎచ్చట నీత్రాటిని దాఁతును. (ఆలోచించి) కానీ, తోఁచెను. ఈ హస్తిశాలలోఁ ద్రాళ్ళు కోసి యుంచెదను. (ఉంచి పరిక్రమించి)

మ. అదె తంత్రీధ్వని! కామినీమధుర గీతారావ సంమేళితం

వేఱొకదెసఁ బోయెదను.

బదె! గంధస్ఫురణంబు కుంభివరదానామోద సంబోధితం

ముహూర్తముండి పోయెదను.

బదె! దీపప్రభ యందు నుండరె భళీ! యారక్షు లన్నిద్రులై

గతియేమి?

సదరంబయ్యెడు రాత్రియొక్క మహిభృత్సద్మంబు బద్మంబులున్.

పోయెదను; ఇదియె యామె చెప్పినమార్గము; ఇదె మందాకిని; ఇదె దారుపర్వతకము; అదియె యుపస్థానసభ; అహో, అది కన్యాపురప్రాసాదము. దీనిలోఁ గాఢకర్మ బహుళతచేతను, జాలకములు దగ్గఱఁగా నుండుటచేతను, నెక్కుట సులు వగును. లేక దురారోహమగునేమో! ఏల,

ఉ. చిత్తములోనికోరికలు చేవడఁ దొయ్యలి డాయవచ్చి యీ
కొత్తళ మెక్కి లోన డిగఁ గొంకుట నాకిటఁ జేల? దప్పిపై
పత్తిలిపోయి నాలుకయుఁ బద్మసరోవరనాళకంటకో
పాత్తభయాతురుం డగుచుఁబాయునె పాథముఁగ్రోల కెవ్వఁడున్!

కానీ యెక్కడను (ఎక్కి) ఇదియె ఆమెచెప్పిన జాల యంత్రము. (తెలిచి ప్రవేశించి చూచి) బాగు, కుంతిభోజ! బాగు. ఈ భవనము స్వర్గము నెగనవ్వుచున్నట్లున్నది. అట్లె.

ఉ. అంచలు నిద్రసేయు స్ఫటికామలరత్న శిలాతలంబులన్
నించిరి సైకతాళిఁ బురుణింప విదూరజవజ్రాక్తి కావళుల్
మించులు గ్రక్కుఁ గంబములు మేలిప్రవాళపరిష్కృతంబులై
యొంచఁగ వేయు నేల మణులెండలు గాయఁగ డాఁగె దివ్వియల్.

ఇఁక రౌద్రవేషమేల? (చోరవేషము పుచ్చి కక్ష్యాబంధము వదలుచున్నాఁడు)

నళి - భర్తృదారకుని వృత్తాంత మేమయ్యె? భర్తృదారికకు నీయవస్థలోఁ బొందరాని నిద్ర కలిగె, నిద్రపోనిమ్ము; ఇప్పుడు నాప్రియుఁడు వచ్చు నని విన్నంతనే—

అవి - (విని వేగముతో సమీపించి) అమ్మా, ఇదె నావృత్తాంతము.

నళి - (చూచి సహర్షముగా) భర్తృదారక! మీకు స్వాగతము.

అవి - (చూచి యానందముతో) అక్కాంతయే యది! దీనిఁజూచిన నాకు,

చ. తనియదు చూడ్కి మేఁ గలయఁ దాఁకెదునో సతిఁ గౌఁగిలింపఁగాఁ
గమకనిఁ జెందె బుద్ధియును గాయ్యనఁబాఱెడు నొక్కకాంతమే
లక్కనుపఁగ, రాగ మంగము నలంతలఁ బెట్టునో నూలుకొల్పి పే
ర్చినయొలమిం బ్రసన్నమగు ప్రేమ్మడి మూర్ఛిలు నంతరాత్మయున్.

నళి - (తనలో) ఇదె భగవంతుఁడు కామదేవుఁడు నదీప్రవాహమువలె రెండు ప్రక్కలఁ బీడించుచున్నాఁడు! భర్తృదారక, శయనతలము నలంకరింపుము.

అవి - మంచిది (కూర్చుండును.)

నళి - భర్తృదారక, భర్తృదారికను మేల్కొనుపుదునా?

అవి - బాలచాపలము వలదు; చూడు.

ఈ కన్నులు నాకు రెండ, యొడికంబుగ వేయును గావు బుద్ధియుఁ
బ్రన్ననికోర్కులం దడవు పొల్పడుటం గడుమూఁకమయ్యె నీ
యున్నవుఁ గాంచి నేఁడ మదనార్ణవపారముఁ జేరఁగంటి నా
కన్నులు మేమెయిఁ జెలువగాత్రములం విహరింప నోర్వవే?

నళి - ఎఱుఁగుదు నెఱుఁగుదు భర్తృదారికకు భర్తృదారకుని పరిశ్రమము.

అవి - ఇప్పుడ నాపరిశ్రమము సఫల మయ్యె.

కురం - (మేల్కొని) ఓసీ, నిరనుక్రోశముగా నేమి చెప్పితివి?

నళి - భర్తృదారిక, నేను మొదటనె చెప్పనా?

అవి - నాజీవితమునకు ఫలము పొందితిని; దేనిచే నిది యిట్టి మోహము పొందె?

కురం - (తనలో) హుం, పరిభ్రష్ట నైతి! (ప్రకాశముగా) ఓసీ, నే నే మంటిని?

నళిని - భర్తృదారిక! ఏమియుఁ జెప్పలేదుగదా!

అవి - ఇది ఈమెమోహావిస్తరమున నాకు రెండవమోహము.

కురం - నళినికా! చాలప్రొద్దు కూర్చుంటివి, ప్రొద్దెంత?

నళి - అర్ధరాత్ర మయ్యె.

కురం - కావుననలసితివి; వచ్చినన్నుఁ గౌఁగిలించుకొనుము.

నళి - (వణుఁకుగా) నేను దేహము నొత్తెదను; భర్తృదారికం గౌఁగిలింపుము.

అవి - (హర్షముతో) మంచిది. ఇట్లే నీవును ప్రియశతములను వినుము.

కురం - అతిస్నేహముచేఁ బ్రయోజన మేమి? ఇప్పుడే రమ్ము.

నళి - భర్తృదారిక, ఇదె యున్నాను.

కురం - (బలవంతముగా నళినికను నీడ్చి కౌఁగిలించుకొనును.) హాం, ఎవరు నన్ను నొత్తుచున్నారు?

నళి - (చెవిలో) ఇట్లు.

కురం - (సంభ్రమముతో) అయ్యో. నాచారిత్రము హీనమైనది. నాకు భయమెత్తుచున్నది.

అవి -

చ. ఎడఁదలలోన నొండొరు వహించి యెఱింగియు నీవు క్రొత్తవే?
కడు వడఁకంగ నేల సుడిగాలికి నల్లలనాడు తీవవై
జడియకు మిందు నాదెసఁ బ్రసన్నవు కమ్ము శుభాంగి! వేయునున్
వడువుల వేఁడ నేల మగువా శరణాగతు నన్నుఁ గావుమా!

(కురంగి లజ్జతో నళినికఁ జూచును)

నళి - భర్తృదారక! లెమ్ము, లెమ్ము. భర్తదారిక యడుగు చున్నది, లెమ్ము.

అవి - మంచిది. (లేచుచున్నాఁడు)

(ధాత్రి ప్రవేశించును)

ధాత్రి - జయము భర్తృదారక!

అవి - ఎట్లున్నావు?

ధా - నళినికా, మండపములోన పఱుపు పఱచియున్నది. మీ రిరువుర నందే ప్రవేశ పెట్టుము.

నళి - అట్లే, (ధాత్రి నిష్క్రమించును)

నళి - భర్తృదారక! లోమండపమునఁ బఱుపువై చియున్నది. భర్తృదారికతో నందుఁ జొత్తెండు.

అవి - నీవును ప్రియశతములను వినుము. (హస్తముతో కురంగి హస్తము గ్రహించి లేచుచున్నాఁడు.)

నళి - రండు, రండు. భర్తృదారక!

అవి - ఇదె యిదె వచ్చుచున్నాను. (ఇద్దఱుఁ బరిక్రమింతురు)

అవి - (హర్షముతో) నా యౌవనఋణముఁ దీర్చుకొంటిని, ఏలనఁగా,

శా. కన్నీటం దొలఁగాడుఁ గన్గవయుఁ జేఁగ్రాలంగ నూటాడు లేఁ
జన్నుందోయియుఁ బెల్లుమోచుకటియుం బాటాడవ్రీడాగతిన్
ఖన్నం బంఘ్రియుగంబు సప్తపదలక్ష్యం బయ్యెఁ బొం దబ్బె, రే
యన్నా! నాఱుయుగంబులున్నఁగలఁడే యన్యుండు ధన్యుండిలన్.

(అందఱు నిష్క్రమింతురు)

———

అవిమారకము

చతుర్థాంకము - ప్రథమరంగము

(చాంగేరికను గొని మాగధిక ప్రవేశించును)

మాగ - అహో, పరిజనుల ప్రమాదము ! సూర్యోదయ మయ్యెను ప్రాసాదరచన కాలేదు. గోష్ఠీజనకోలాహలము వినరాదు! ఏమైనది ? రాత్రి నిద్ర మేల్కొన్నందునఁ బ్రమాదముగా నిద్రించియుండును. కావున భర్తృదారికను మేల్కొనిపెదను. (పరిక్రమించును.)

(విలాసిని వీజనముతోఁ బ్రవేశించును).

విలా - మాగధిక ! నిలునిలుము.

మాగ - ఓసీ నన్ను వారింపకు, భర్తృదారికకొఱకు నేను సుమనావర్ణకము తెచ్చితిని.

విలా - భర్తృదారికకు సుమనావర్ణకముగాని, అలంకారము గాని యేల ?

మాగ - అవినీతా, అమంగళము వల్కకుము! భర్తృదారిక యెల్లప్పుడు నలంకృత యగుఁగాక !

విలా - అట్లు కాదు! భర్తృదారిక కాకృతియే యలంకార మని చెప్పుచున్నాను.

మాగ - ఓ పిచ్చిదానా! పుష్పమును వాసింపఁజేయదా?

విలా - అది నిశ్చయము. స్వభావరమణీయము లగునట్టివి యలంకారముచే నతిరమణీయము లగును.

మాగ - ఓసీ, భర్తృదారిక రూపమున కనురూప మగు భర్తయే కలిగెను.

విలా - పక్షపాత మేల? భర్తృదారకుఁబోల భర్తృదారిక పద్మినివలె యగపడుచున్నది.

మాగ - బాగుగాఁ జెప్పితివి; నాకుఁ జూడ భగవంతుఁడు మన్మథుఁడు శరీరమెత్తిననిట్లుండు నని తోఁచుచున్నది.

విలా - కావుననే భర్తృదారిక భర్తృదారకువదలి క్షణమాత్ర మైన రమింప నొల్లదు.

(కన్నీళ్లతో నళినిక ప్రవేశించును.)

నళి - (శోకముతో) సుఖములకు విఘ్నములు పెక్కులనులోక ప్రవాదము సత్యమేగద! భర్తృదారిక కవిచ్ఛిన్నసుఖ సంభోగముతోడ రతి కలిగించి సంవత్సరమాత్రమ యయ్యె. మనగోష్ఠీజనుల కుత్తరకురువాసము మరలఁ గలిగె; ఇప్పుడు మరల మహారాజీవృత్తాంత మెటింగె నని విని నా శరీరము పగులుచున్నట్లున్నది. భర్తృ

దారికయు లజ్జాభయమదనులచే గొట్టఁబడుచు సంతాపముచే ముగ్ధాపగతచేతనయై యున్నది. ఈప్రాసాదము చూడ దీప మాఱినట్లు పాడుపడియున్నది. ఆ భర్తృదారకు నెడబాసిన నాకును దేనిలోను హృదయప్రీతి పుట్టదు. భర్తృదారకుఁ డవిఘ్నముగా వెడలిపోయెనని విని నాహృదయము ప్రహ్లాదించిన ట్టున్నది. ఇప్పుడు కన్యాపురమును జక్కఁగా నవరోధించిరి. అహో సఖులు, ఓసీ మాగధికా, ఇది యేమి ?

మాగ - ఓసీ, ఏ మడిగితివి ? భర్తృదారికకు మండనవేళ కదా !

నళి - ఉత్సవము దాఁటిపోయెను. (ఏడ్చుచున్నది)

ఇరు - ఇది స్వప్నమయ్యెనా యేమి ? సమానులము, చెప్పుము.

నళి - భర్తృదారకుఁ డెల్లవిధములఁ బోయెను !

ఇరు - హం——

నళి - నేనును భర్తృదారికదుఃఖమును జూడలేకిచ్చుటకి వచ్చితిని.

మాగ - భర్తృదారికావస్థను జూడ శక్యము గాదు ; అయిన నామె నూఱడింతము.

ఇరువు - అట్లే చేయుదము——(నిష్క్రమింతురు).

చతుర్థాంకము — ద్వితీయరంగము

(అవిమారకుఁడు ప్రవేశించును)

అవి - (శోకముతో)

చ. కలిగెను గాక నా కెటులొ కన్నెలయంతిపురంబుఁ బాసి రా
వలసినభాగ్యశేషమున, వేయును నేల శరీరమాత్రుఁడన్
జెలువకు నాఁకలో నిలచి చిత్తము నన్నిటఁ జేరరాదు నా
వలను దలంపఁబోదు విరిఁవాలినభృంగమువోలె నక్కటా!

కురంగి యవస్థ యే మై యుండునో!

చ. చన వటె యాఁడుపాపలు గుసాగుసలాడికొనంగ సిగ్గువో
యెనో! తనతండ్రి యంతిపురి కిక్కటఁ గ్రుక్కటఁ గాపువెట్టఁగా
మనమున నల్కెనో! బయిసిమాలినరాత్రుల నన్నుఁ గానకే
మునుకొను బాష్పవారిఁ బడి మూర్ఛ మునింగెనో యేమి సేయుదున్!

హా! ప్రతీకారము తోఁచెను. అదియు నాపై నపేక్షచేఁ దనయాత్మ నిలుపఁగోరదు. కావున నేనును దాని కొఱకే ప్రాణములు పరిత్యజించెదను. (పరిక్రమించి) ఎడఁబాసి కొన్నిదివసము లయ్యె; ఇప్పుడును మనస్సును శరీరమును దుఃఖమును భరింపఁజాలనివివలె నాకుఁ దోఁచుచున్నది. ఇప్పుడును,—

ఉ. ఓలములే క తో నునికి నుబ్బుచునుండు మనోనురాగముల్
గ్రాలెడుదాని రూప మెసకం బగుదాని, విలాసయౌవన
శ్రీ లగుదానిఁ బాసి యొకక్రేవ్మిడియైనను వంచితుండ నా
కేల మనంగఁ, గల్గునొకో యింతకు నెక్కృతఘ్నభావముల్?

ఇప్పుడు మన్మథునిచే లోన దహింపఁజేయఁబడుచున్న వానికి సహస్రరశ్మి యగు సూర్యభగవానుఁడు బొగ్గువలె నగుచున్నాఁడు. (కలయఁజూచి) నిదాఘ మెంత భయంకరమైనది; ఇప్పుడును,

మ. రవి యుగ్రజ్వరమట్లు పెల్చె మహిసారం బెల్ల నుష్ణాంశులన్,
దవవహ్నిం దరుకోటి యత్స్మరుజచేతంబోలె విచ్ఛాయతన్
నవిసెన్, నైలము లేడ్చెనో వివశతన్ నానుచ్ఛ్రితాస్యద్గుహల్
దవిలెన్, లోకము సూర్యపాకమునఁ జిత్రం బేది మూర్ఛిల్లునో!

నే నిప్పు డేమి చేయుదును! పోవుటకును సమర్థుఁడఁ గాను, ఏలనఁగా,

చ. ధర సికతాగ్నిచూర్ణములఁ దారుణవాతము లేచిపూయఁగాఁ
బరుప పలాశముల్ నెఱపి బాధలువెట్టఁ దరుప్రజంబు, భా
స్కరుఁడు ద్రవస్వరూప మయి కాఁ బెడునో కొక దవాగ్నిచందమై
ధర నవ సూర్యపాకచలితం బయి లోకము పక్వమయ్యెడున్!

హా, ప్రియా! హా, సుందరి! నాకుఁ బ్రతివచన మిమ్ము. (మూర్ఛనటించును—మరల నిట్టూర్చి, మీఁదఁ జూచి) సహస్రకిరణుఁడగు సూర్యభగవానుని మేఘము గప్పుకొనియెఁగదా! కాక,

ఆ. దీనఁ జిత్ర మేమి తెమ్మెరల్ గొనితేర
మేఘపంక్తి నెఱసి మిహిరుఁ గప్పె
మద్ధృదంతరాళశున్యమండల మిది
కప్పెనేని చిత్రకర్మ గాదె?

ఈ జీవన్మరణ మేల? నా దేహము వదలెదను. (లేచి పరిక్రమించును) ఏమి చేయుదు; కానీ, తోఁచెను. ఈయరణ్యా

తటాకమున మేను వదలిపెట్టెదను. ఛీ! నా మరణమార్గ మధర్మమే. అభిమానమోహమువలన గొప్పమార్గము మఱచితిని. వేఱొకవిధముగాఁ బ్రయత్నించెద. (చూచి) కానీ, తెలిసె. హాహో! సమీపమున దవాగ్ని కానవచ్చుచున్నది. దానిలో నాప్రాణముల వ్రేల్చెదను. (సమీపించి నమస్కరించి) భగవదగ్నీ!

గీ. ఒక్కచిత్తంబుతో నున్న యుగ్రములకు
నుల్లమునఁ గోర్కి లీడేర్ప నోపు నేని
యగ్ని యొసఁగెడు నాకు జన్మాంతరమున
నేకచిత్తానువృత్తి నయ్యిందువదన.

(అగ్నిలోఁ జొచ్చి కుతూహలముతో) ఏమి యిట్లున్నది!

చ. తరువులు విస్ఫులింగములతాఁకున నుండె ధరిత్రి వ్రాల వి
స్తర మగు మంటలో నులయచందన కర్దమశీతలంబు లై
కరఁగెడు మేన, నగ్నియును గాచి ననుం గృపతోడ మన్మథా
తురుఁ డని కౌఁగలించెడు సుతుం జనకుండునుబోలె హృష్టుఁడై!

హాహో! ఇఁక దీనికంటె నద్భుత మేమున్నది! అగ్నియే నన్ను దహింపకున్నాఁడు. కాన దీనికినిఁ గారణము గలదు; వేఱొకవిధముగాఁ బ్రయత్నించెదను. (పరిక్రమించి) ఇది పెద్ద పర్వతమే.

ఉ. నీలపయోదపంక్తి శరణం శిఖరావళి మాటు సేయ దే
వాళి నభోవిహారముల నల్లన యించుక విశ్రమింప నీ
శైలము మిత్రయుక్తి బుధసత్కవి యోగవిలాససంపదం
గ్రాలియు నీచరాజుగతి గర్హ్యమ యయ్యెడు నిష్ఫలస్థితిక్.

కానీ, ఇప్పు డీశైలమునఁ బ్రాణముల వదలిపెట్టెదను. గాలిలోఁ బడినవానికి సర్వార్థసాధనము లోడఁ గూడును. కావున నెక్కెదను. (ఎక్కి చూచి) పర్వతమునం దున్న యీ నీటి స్నానముచేసి యుపస్పృశము చేసి మంత్రము జపించెద.

(అట్లు చేసి జపించును విద్యాధరుఁడు ప్రియురాలితోఁ బ్రవేశించును.)

విద్యా -

మ. మునిసంజం గురుభూమిఁబుచ్చి తదయాక్ మోదించి యమ్మానసం
బున సన్మందరకందరాంతరములం బుష్పావస్థ్రి మెప్పించి యా
వనలీలక్ విహరించి హైమవత దివ్యశ్రోణి నేత్రోత్సవం
బొనరం బుత్తము చందనాద్రితట నిద్రోద్వృత్తి నుధ్యాహ్నముక్

(ఆకాశయానము నిరూపించి) సౌదామని, చూడుచూడు! దూరముననున్న భగవతి - వసుంధరాదేవి యాకృతి యెంత రమణీయముగా నున్నదో! ఇట,

మ. గిరు లేనుంగులగున్న లై జలనిధుల్ క్రీడాతటాకంబు లై
తరువుల్ శైవల మై సమస్థలముగా ధాత్రీతలం బొప్పె వి
స్తరసీమంతము లై తరంగిణులు సౌధవ్యూహముల్ బిందు లై
ధరవక్త్రిం బనఁ దోచు ధారుణి; తగుక్ దా రూపసంక్షేపతక్.

భద్రా, హెచ్చరికగా నుండుము. శీతచందన నిలయ మగు మలయమునకుఁ బోవుచున్నాము.

సౌదా - అయ్యా! అట్లె.

(ఇరువు రాకాశయానము నిరూపింతురు)

సౌదా - అయ్యా, విశ్రమింపక పోవుటకు నావలనఁ గానేరదు.

విద్యా - అట్లయిన నేదోపర్వతమున ముహూర్తము విశ్రమించి పోవుదము.

సౌదా - అయ్యా, నా కది ప్రియమే. (ఇరువురు దిగుచున్నారు)

విద్యా - సౌదామని, చూడుచూడు!

గీ. వేగగతి నభ్రగహనంబు వెనుకఁ బాఱు
జడధిముద్రితధర మీఁదఁ బడఁగఁబోలు!
నివె నగంబులు వర్షాభ్రనివహమట్లు
పెరిగి యెదు రెత్తుదెంచెడుఁ బెల్లుగాఁగ.

ప్రియురాలా! ఈ పర్వతము మనకు ముహూర్తకాల మాతిథ్య మొసంగ సమర్థమైన దానివలె నున్నది. కావున నిందు విశ్రమించి పోదము.

సౌదా - అయ్యా, అట్లుచేయుదము. (పుష్పాపచయము నటింతురు)

విద్యా - పుష్పించిన వృక్షముల నాఱవభాగము మాకుఁబొందవలసిన ధర్మము. కావున నీవృక్షములఋణము తీర్తము.

సౌదా - అయ్యా, అట్లే.

విద్యా - (అవిమారకుం జూచి), అహో, వీఁడెవ్వఁడు! (ఆలోచించి) ఆ! తెలిసె; మంత్రభ్రష్టుఁడగు విద్యాధరుఁడే; ఏలనఁగా నిట్టిరూప మితరులలోఁగానరాదు. శుభమునకే యితఁడు మనలఁ జూచెను; కానీ, మఱచినవీనిఁ బల్కరించెదను.

అవి - కానీ, దేవకార్య మయ్యె. ఇఁకఁ బడియెద. (ప్రక్కఁ జూచి విద్యాధరుం గని) ఓహో, ఎవఁడీతఁడు? లేక యిది స్వప్నమా? నేను నిద్ర సెంద లేదు. ఆ, అంత్యకాలమున మనుష్యు లేమో చూతురు; అదియే యిది కాఁబోలు; అదియు మూఢుల కేకదా; నేనో సర్వ మెఱుఁగుదును. కానీ,ఇతనింబలుకరించెదను;అయ్యా! నీ వేవంశము నలంకరించుచున్నావు?

విద్యా - వినుము, నేను మేఘనాదుఁ డను విద్యాధరుఁడను. ఇదియె నాకుటుంబిని సౌదామని యనునది. ఇప్పుడు మలయపర్వతమున భగవదగస్త్యపాదుల నారాధింప విద్యాధరు లుత్సవము ప్రారంభించిరి. అచ్చటికి మేము సంకేతింపఁ బడితిమి. ఇచ్చట ముహూర్తము విశ్రమించి పోద మని యిందు దిగితిమి. ఇది మా వృత్తాంతము; ఇఁక నీ వెందుకొఱకు భూతలమును దేవలోకముగాఁ జేయుచున్నావు?

అవి - (తనలో) ఏమని చెప్పుదును? నా కంత్యకాలము వచ్చినది, అనృతము చెప్పరాదు. (ప్రకాశముగా) అయ్యా! సౌవీరరాజపుత్రుఁడ నవిమారక నామధేయుఁడను.

విద్యా - (తనలో) ఇది యనృతము; ఇతఁడు మానుషాకృతి గాఁడు (ప్రకాశముగా) మఱి యేల యిట నొంటరిగా వచ్చితివి?

అవి - (తనలో) ఏమని చెప్పుదును ? (అధోముఖుఁడై నిలుచును)

విద్యా - (తనలో) కానీ, నేనే యెఱింగెదను (విద్య నావర్తించును) అయ్యో, కష్టము! ఇతఁ డగ్నిభగవానుని పుత్రుఁ డని తన్నెఱుంగఁడు. కుంతిభోజుని కూఁతుఁ గురంగి నభిలషించి దానితోఁ గ్రీడించుచుండి వృత్తాంతము విదితమై యిటు వెల్వడివచ్చెను. మఱియుఁ బ్రవేశోపాయము లభింపకునికిఁ బ్రాణములం బరిత్యజింపఁ గోరి మరుత్ప్రపాతమొనర్ప దీని నెక్కెను. అదియు నచ్చట జీవన్మరణ మనుభవించుచున్నది. వీని యీ కార్యమునకు నేను తోడ్పడవలె. (ప్రకాశముగా) అవి మారక ! మైత్రి యనునది యచ్ఛలము. నే నెఱింగిన యీ విషయము గప్పిపుచ్చలేవైతి.

అవి - చెప్పుము.

విద్యా - నేఁటఁగోలె మనయిరువురకు మైత్రి కలుగుఁగాక. నీయవస్థయెల్లయు మాకుఁ దెల్లమయ్యె. నీవు ప్రాణపరిత్యాగార్థ మిచ్చట కెక్కితివి గదా ?

అవి - వయస్య, అదియట్టిదే.

విద్యా - ఈ విస్రంభముచేఁ బ్రీతుఁడ నైతి; అజ్ఞాతముగా లోనఁబ్రవేశింప వెరవు గలదేని నీ వేమి చేయుదువు?

అవి - (హర్షముతో) వే తేమి గలదు? మీవెంటఁ బ్రవేశించెదను. అందులకే యీవ్యాక్షేపము.

విద్యా - అట్లయిన సఖా! ఈయంగులీయమును జూడుము.

(ఉంగరముఁ జూపుచున్నాఁడు)

అవి - వయస్యా! దీనిచేఁ బ్రయోజనమేమి?

విద్యా - ఈయంగులీయకమును కుడిప్రేల ధరింతువేని యదృశ్యుఁడ వగుదువు. ఎడమప్రేలనుంచిన స్వభావముగా నుందువు.

అవి - వయస్యా, అదియు నట్లయుండును.

విద్యా - నీ కిప్పుడ నమ్మకము పుట్టించెదను; వయస్యా, నన్నుఁ జూచుచున్నావా?

అవి - ఇట్లు,-

విద్యా - అవధరింపుము.

అవి - అవధరించితిని.

విద్యా - (కుడిప్రేలవైచి) వయస్యా! నన్నుఁజూచెదవా యేమి?

అవి - వయస్యా! ఛాయయుఁ గానరాదు; ఇఁక శరీరము మాటయేల? ఇట్టివారే లోకమున సఖులనఁబడువారు!

మ. తిరుగన్నేర్తురు ప్రాణవల్లభలతో దివ్యావకాశంబులన్,
గిరికూటంబుల వశ్యవిద్యలగుచుం గ్రీడింపఁగా నేర్తు, రి
ద్ధరణిన్ సర్వ మెఱుంగ నేర్తు రసకృన్మంత్రప్రభావంబులన్,
బరఁగన్నేర్తురు మాడ్కి-కిన్ మఱుఁగఁ దోపం గ్రమ్మఱన్ లీలమై.

కానీ, ఇఁక దీనితో నేనును బ్రవేశించినట్లు.

విద్యా - (ఎడమప్రేల వైచుకొని) కావున దీనిఁ బుచ్చుకొనుము.

అవి - (ప్రతిగ్రహించి) అనుగృహీతుఁడ నైతిని.

విద్యా - కాదు, కాదు, నేనె యనుగృహీతుఁడ నైతిని; ఎందులకనఁగా,

క. వెలలేని రత్న మొందిన
యలఘుఁడు పరితుష్టుఁ డగునె? యర్థులకు మదిం
గలుగునందందకాంక్షలు
వొలయఁగ మును దీర్చి యెలమి వొందకయున్నన్.

అవి - నా కొకసంశయము గలదు. నాశరీరమునఁ బరీక్షించుట కని చెప్పుటకు సిగ్గుపడుచున్నాను.

విద్యా - అట్లయిన, కుడిప్రేల నుంచుకొనుము.

అవి - మంచిది. (అట్లు చేయును).

విద్యా - వయస్య, కత్తి పుచ్చుకొనుము.

అవి - మంచిది. (ఖడ్గము పుచ్చుకొని విస్మయముతో) అహో, ఖడ్గప్రభావము!

క. పెదు నెట్లు మాఱునుల చెనో!
యెడ నెనో చపలాకలాప మడిదపురూపై,
యుడఁగించి సూర్యకాంతుల
నడి మార్గా నడవి దావవహ్ని చెలంగన్

విద్యా - అహో, అగ్నిపుత్త్రునివీర్య మెట్టిది! ఈ ఖడ్గప్రభావమును విద్యాధరులలోను గొందఱే సహింతురు. అగ్నిభగవానుఁడే రక్షించుచుండును.

అవి - (ఖడ్గమును జూచి) అహాహో, విద్యాదేవతల కెట్టిప్రభావము గలదు!

క. రా నయ్యె దివ్యశక్తులు
నే నెప్పటివాఁడఁ జేర, నెక్కొలితి గుణసం
మానతఁ బ్రభావహీనుల
కీనా మెయి గాక నేఁటి యెఱుఁగంగను నే?

వయస్య! నాకార్య మైనది, ఖడ్గము పుచ్చుకొనుము.

విద్యా - నీకెట్టిష్టమో యట్లే, వయస్య! అంతర్హితుఁడును, అతని ముట్టినవాఁడును, అంతర్హితులగుదు రనుట నిశ్చయము.

అవి - మిత్రమా! ప్రీతి యయ్యె, ఇది యభ్యుదయముల కెల్ల నభ్యుదయము. సఖా! నన్నపేక్షించి యింతసేపు దడసితి నని తలంచెదను. ఇఁక వేళాతిక్రమము గానీయకుము.

విద్యా - నీవు చెప్పుచుండఁగానే యాకసముఁ జొచ్చితిని.

అవి - బహుభాషలేల!

గీ. అఖిలవిద్యలు నగ్గంబు లైనవిూకు
నాచరింతుగ మాఱు మాయట్టివారు
ప్రాఁత మిచ్చితి వమ్మిడ నైతి నన్ను
వెట్టి యని యేల, నీపనివిందు నేను.

విద్యా - కపటము లేని నీబుద్ధి నేనెఱుంగుదును. నీవును నా మాట ననువర్తించెద వేని,

గీ. ఇందువదనకు నను దీని నెఱుఁగఁ జెప్పి
యుండు మముఁబోలె, మాశోక మొత్తిచూచి
ప్రియకుఁ గ్రీడారసంబులఁ బ్రియము గూర్పు,
పనియుఁ గలిగిన మరల నీపజ్జనుండు.

అహో, పురుషసార మనునది నామనమును విడువ నొల్లదు. వయస్య! ఇఁకఁ బోయెదము.

అవి - పోయి మరల దర్శన మిందు.

విద్యా - మంచిది. (విద్యాధరుఁడు ప్రియురాలితో నెగయును.)

అవి - (మీఁదఁజూచి) ఇదే! మేఘనాదుఁడు గగనార్ణవమున మునింగెను. వీఁడు.

సీ. గమనవేగంబునఁ గడవెండ్రుకలు గాలి
తేఁదరంగంబులలీలఁ బొలయ
సలిలభృద్వీథులఁ జనఁజొచ్చి వెడలుచోఁ
గరఁగి మైపూఁతలు తెరలఁబాఱఁ
గడిఁదిగాఁ గట్టినయొడలోనియడిసంబు
తళతళత్కాంతు లందందఁ గురియఁ
దన బహిఃప్రాణమై తనరుజవ్వనిచేతఁ
జకిగొన్న సధ్యంబు సన్నగిల్ల

నుత్తరీయంబు గాలికి నొత్తిగిల్ల
ముకుటమణికాంతి తారకానికరములకు
మెఱుఁగు లీ మింటఁ జనఁజన మేను తఱిగి
మఱుఁగు విద్యాధరుండు శ్రీమంతుఁ డతఁడ!

ఈమెయు విద్యాబలమును బ్రియు ననువర్తించు చున్నది. ఈమె,

చ. జనమునఁజేసి విచ్చగొని జాఱినవేనలి పజ్జఁబాయఁగా
లవలవఁ జన్నుదోయి గదలం దనుమధ్యము బ్రుంగి చిక్కఁ ని
య్యువతి మనఃప్రియాంగమున నొయ్యన వ్రాలి మెఱుంగుచాడ్పునన్
గవకవఁ గోచి తోఁన మఱుఁగంజను నల్లదె యభ్రవీథులన్!

మేఘనాదుఁ డిఁకఁబోయెను. నేను నిప్పుడ నగరాభిముఖుఁడ నయ్యెదను. ఇఁక దిగియెదను. (దిగి) నే నలసితిని. కానీ, ఈశిలాతలమున ముహూర్తము విశ్రమించి పోయెదను. (కూర్చుండును)

(విదూషకుఁడు ప్రవేశించును)

విదూ - అహో! అచ్చట సుగృహీత నామధేయుఁ డగు సౌవీరభూపతి యధన్యత్వము! ఎట్లు చిరకాల మనపత్యుఁడై తన నియమ విశేషంబులచేతను దైవప్రసాదంబుచేతను మనుష్యలోక దుర్లభుఁడగు పుత్త్రునిం బడసి మఱియునట్లయయ్యె! ఎల్లవిధముల నాబ్రదుకు మాఱుటచేతను బంధుజనదౌర్భాగ్యముచేతను గుమారుఁడు పరిభ్రష్టుఁడయ్యె! (పరిక్రమించి) ఇప్పుడు నామెనా కొమారుఁడు క్షేమముతో నున్నాఁడా యని యడిగెను! లేక యతి సుకుమారుఁ డగు రాజకుమారుఁ డొంటరిగా మన్మథునిచేఁ గొట్టఁబడుచుఁ బరిభ్రష్టుఁడై జీవించి యుండు నని యెవ్వ రెఱుంగుదురు? నేనును

సకలలోకములు దిరిగి కుమారునిగాని కుమారుని శరీరమునుగాని చూచెదను. అట్లు చూడకున్న నత నికిఁ బరలోకమున సహాయుఁడ నయ్యెదను! నే నలసి తిని. కానీ, ఈ వృక్షచ్ఛాయలో ముహూర్తము విశ్రమించి పోయెదను. (నిద్రించును.)

అవి - సంతుష్టునియవస్థ యేమై యుండును? నేను వెడలి వచ్చితి ననుట వినియుండెనా చెప్పరె, వినకుండెనా యాబ్రాహ్మణుఁడు విపన్నుఁ డగును. కాక యతఁడు లేక నాసర్వ ప్రయత్నము లేల? అతఁడే—

చ. కలఁకుల యోధ, వైరిగణఘట్టన సాహసికుండు, నిండుగో
ష్ఠులఁ బరిహాసపేశలవచోవిభవుండు, గురుండు, శోకవే
ళల హృదికిం మహోత్సవ విలాసము వొందఁగఁ జేయు, వేయుమా
టలఁ బనియేమి? యొక్కఁడ యొడల్ సడపాడెడు రెండురూపులై!

(కలయఁజూచి) ఓరీ! ఎవఁ డది నీడలోఁ బాంథుఁడు నిద్రించుచున్నాఁడు? (సమీపించి) నాహృదయమునకుఁ గోరి నట్టుగా నాగత మయ్యె నభ్యుదయము. వీనినిఁ గౌఁగిలించు కొనుటకు నామనస్సు త్వరపడుచున్నది.

విదూ - (మేల్కొని) చాలప్రొద్దునిద్రించితిని. ఇఁకఁబోయెదను. మనోరథములు చెడినవారికి విశ్రాంతి యేల? (పరిక్రమించి యవిమారకుం జూచి) ఎట్లు నీ విచ్చటికి-అవిమారక!—

అవి - అయే! స్నేహితుఁడు సంతుష్టుఁడు!—

(ఇద్దఱును గౌఁగిలించుకొనుచున్నారు)

విదూ - (గట్టిగానవ్వి) ఓవయస్య, చెప్పుచెప్పు మింతకాలమేమి చేయుచుంటివి ?

అవి - వయస్య, ఇదియే చేసితిని. (అంగుళీయకము దక్షిణాంగుళిలోఁ పైచుకొని తిరస్కృతుఁ డగును.)

విదూ - హా, హా, నీ వెక్కడికిఁ బోయితివి ? ఎట్లగపడరావు ? హా, పోయెనను చింతచే నతనివలెఁ జూచితిని ! లేక తెల్లముగాఁ జేసికొనియెద. ఓవయస్యా, నీవు మఱుగు పఱచుకొనునెడల నొట్టు పెట్టితిని.

అవి - వయస్య, ఇదె యున్నాను.

విదూ - ఎక్క డెక్కడ ?

అవి - (ఎడమవ్రేల నుంగరము ధరించి) వయస్య, ఇదె.

విదూ - మొదట శుద్ధుఁ డగు నవిమారకుఁ డుండె, ఇప్పుడు మాయావిమారకుఁ డయ్యెను; ఇట్లె, ఓమాయవిత్తక! ఏల నీవు కన్యాపురమునఁ బ్రచ్ఛన్న రూపుఁడ వై సంచరింపఁజాలవు ?

అవి - వయస్య, ఇప్పుడకదా యిది లభించె !

విదూ - ఆశ్చర్య మాశ్చర్యము ! ఎక్కడినుండి వచ్చెను !

అవి - అంతయు నంతఃపురములోఁ జెప్పెదను.

విదూ - ఇప్పుడు నే నాఁకలిగొనియున్నాను.

అవి - వైధేయ! ప్రక్షేపభూమిం ప్రవేశింతము. త్వరగా రమ్ము. నీవు నాచేయి వదలరాదు.

విదూ - ఆశ్చర్య మాశ్చర్యము. నేను నిఁక నదృశ్యుఁడనే; నాశరీర మున్నదా లేదా? లెమ్ము, చేయుదము. ధు-ధు-ధు——

అవి - మూర్ఖ; ఏల జాగుసేసెదవు? కాంతాదర్శనమునకుగా నామనస్సు త్వరపడుచున్నది. (లాగుచున్నాఁడు)

విదూ - నా కేమిశ్రద్ధ!

అవి - కానీ, భోజనవేళ నెదురుచూచుచున్నాను.

విదూ - కొంతప్రొద్దు విశ్రమించి పోవుదము.

అవి - ఏమి? ఇంకను నాకొఱకుఁ గురంగిని స్మరింపవు?

విదూ - నగ్నాంధశ్రమణిక జీవించియున్నదా?

అవి - వయస్య, నిన్ను వేఁడుకొనెదను, త్వరగా రమ్ము.

విదూ - ఎందువలన నీవు సమావర్తనము పొందినవటువువలెఁ ద్వరపడెదవు?

అవి - మూర్ఖ, ఇటు రమ్ము.

విదూ - న న్నీడువకుము. నేను వెంటఁ బరువెత్తి వచ్చెదను.

అవి - (పరిక్రమించి) ఇదియె నగరము.

విదూ - ఈనగరశోభ గానవచ్చుచున్నది.

అవి - ఇదియె రాజభవనము.

ఆ. సాహసించి రాత్రి శంకమైఁ జొచ్చితి
నీనరేంద్రభవన మిపుడు పగలె
సత్సమూహ మైంద్రజాలికుగతి శంకఁ
ద్రోచిచొత్తు మాయ దోడువడఁగ.

(పరిక్రమించి) ఇప్పు డీప్రసాదమునఁ గురంగి స్నానము సేసి యభ్యంతరమున నుండును.

విదూ - అక్కడఁగాని యెక్కడఁగాని చొత్తము. భిక్షా వేళ యతిక్రమించుచున్నది.

అవి - రమ్ము; అట్లయిన నభ్యంతరమునకే పోదము. (చొచ్చి) ఇక్కడ.

ఉ. తొల్లిటిపొందు చేడ్పడిన దుర్లభచింతలు మోచిమోచి రా
గిల్లుచు వచ్చి ~~యిట్టు~~ [illegible] గృతకృత్యతమై హృదయంబు హర్షసం
పుల్లముగా మనస్సులగుభూరి మహాద్భుత ధీరకర్మ ~~[illegible]~~ [illegible]
~~[illegible]~~ నొండ్లగృహంబు ~~[illegible]~~
[illegible]
(నిష్క్రమింతురు)

అ వి మా ర క ము

పంచమాంకము - ప్రథమరంగము

(కురంగియు నళినికయుఁ బ్రవేశింతురు)

నళి - భర్తృదారిక, ఏలసంతాపించెదవు. కన్యాపురప్రాసాద మెక్కి దృష్టివిలోభనము తీర్చుచుందము.

కురం - ఓసీ, నాహృదయము గుర్తెఱిఁగితివా యేమి? నా పరిజనము కానకయున్న నాకుఁబరితోషార్థమై తెచ్చిన వకుళ సరళ సర్జార్జున కదంబనీప నిచుళ ప్రభృతులు పరమసురభి పూతము లయ్యు మేఘకాల వల్లభములు కావున నా కున్మాదము కలిగించుచున్నవి. మఱియు నీమయూరము మాకు రాజగృహ మానసమునఁ జాల బీరమర్దభావమును బొందుచున్నది. మే మెప్పుడు లాలించుచున్నను దేశకాలముల నెఱుఁగమిచే నధిక జ్ఞత్వము చూపుచున్నది. శుకశారికలును గథలు చెప్పఁదొడంగెను. నా నిర్వేదము గుర్తింపక భూతిక శారికయు సర్వలోక వృత్తాంతము నుడివెద నని వచ్చి యున్నది. నారోగావస్థను విచారింప వచ్చిన పరిజన మును దమ్ము నిర్బంధించి తెలుపుకొనుచున్నారు.

కావున ముహూర్తము ప్రాసాదమున నుండఁగోరు చున్నాను.

నళి - భర్తృదారికకు రుచించినట్లు, కానీ.(ఇద్దఱు నెక్కుదురు)

కురం - ఓసీ, ఇచ్చటను మహానర్థకమే యయ్యె, కాలమేఘుఁడు విద్యుత్ప్రమదను ధరించియే లేచుచున్నాఁడు.

నళి - భర్తృదారిక, ఏలయుత్కంఠపడెదవు? చూడుచూడు నవమేఘములచే నావరింపఁబడి సూర్యునితో నాకాశమున విరళముగా నీరు వర్షించుచున్న దెంతరమణీయముగా నున్నది?

కురం - రమణీయ మగునాకసమును జూచుచు నున్నాను.

(అవిమారకుఁడును విదూషకుఁడును బ్రవేశింతురు)

అవి - వయస్యా, కురంగి యగపడుచున్నది; అది,

చ. అలఁదదు మేన దీర్ఘవిరహజ్వరసంవిధిఁజేసి చల్లఁగాఁ
గలపము లేవియున్ దొడవుగైకొననొల్లదు హావభావలీ
లలుపరువుచ్చునైనను దలంప నిసర్గమనోహరాంగము
జ్జ్వలమయి యొప్పుహేతువుల వర్జిత వేదవిధి శ్రుతిక్రియన్.

విదూ - ఓ, సంతోష మయ్యె, నీవుసర్వలోకమున సురూపుఁడనని గర్వించెద విప్పుడు దీనిస్వభావరమణీయ మగు రూపము నిన్నుఁ దప్పక జయించుచున్నది. నీవియోగముచే నిది కృశించిన దని తలంచెదను; ఇట్లయినను బాలచంద్రరేఖవలెఁ జూడ్కులకు సంతోష మిచ్చుచున్నది.

అవి - సఖా, అతిపండితునివలె నిది యేమి !

విదూ - ఓ, నిత్యపరిచయముచే నన్నుఁ బరిహాసించెదవు. న న్నెఱుఁగనివాఁడు నాబుద్ధి నెక్కువగాఁ బ్రశంసించును; నేను నది యెఱింగియే యెవ్వనితోడను విస్రంభ్రము చేయను.

అవి - ఏల యీయౌదాసీన్యము ! ప్రియురాలిం బ్రబోధింప బహుజన పరివారముచే నవకాశము కలుగదయ్యె. కావున నిప్పుడు మేడపై నున్నను నచ్చటనే దాని బోధించెదను.

విదూ - నీవు చక్కఁగాఁ జెప్పితివి ; మేడ యెక్కుదము.

అవి - సఖా, ప్రాసాదశబ్దము కలుగఁగూడనియట్లు ప్రయత్నముతో నెక్కుము.

విదూ - అయ్యా,అది శక్యముకాదు; ఎంగిలిచేయక యెవ్వఁడు భుజింపఁగలఁడు ? నే నిచ్చటనె యుండెద ; నీవ యెక్కుము.

అవి - నేను నిన్ను విడిచితినేని నీ వగపడుదువు.

విదూ - అయ్యా, నే నది మఱచితిని ; మరల మరలఁ జెప్పుచుండుము.

అవి - ఇటు రమ్ము, (ఎక్కి చూచి) సఖా, ఇదె నాప్రియురాలు నళినికతో శిలాతలమున నున్నది ; ఇది——

ఉ. వామకరంబునం బలుచవాలిన చెమ్మెగమల్ల మోపి యా
క్ష్మాముఁడుతోడ యై పెరుగు కాలము శోకజవార్చివార్చి యి
వ్యామవిలోలనేత్ర వలవంత మెయిం బయిఁబొంగు బాష్పవా
స్తోమము కట్టె నూర్ధ్వదిశఁ జూచెడుఁ గించిదలోల దృష్టియై.

కురం - (తనలో) ఈ జీవన్మరణముచే నేమగును? (ప్రకాశముగా) నళినికా, పోయి మాగధిక నుపస్నానముతోఁ దోడ్తెమ్ము.

నళి - భర్తృదారిక నొంటరిగా విడిచి నేనెట్లు పోవుదును. ఇక్కడ నెవ్వరును లేరుగదా.

హారిణిక - (ప్రవేశించి) జయము భర్తృదారిక, అమ్మగారు, ఇప్పుడు తలనొప్పి యెట్లున్నదని యడుగుచున్నది. ఇదె యౌషధము పూసికొనుము.

కురం - నళినికా, నీ విఁకం బొమ్ము; దేవుఁడు వర్షింప నారంభించెనని తలంచెదను. నేను క్రొత్తవర్షపు నీటితో స్నానము సేయఁ గోరెదను! కావున నుపస్నానమును ద్వరగాఁ దెమ్ము.

నళిని - చిత్తము.

అవి - అది యేమి చెప్పెను?

కురం - ఓసీ, ఇటు రా.

నళి - అమ్మా, ఇదె యున్నాను.

కురం - ఓసీ, నీశరీరము చల్లగా నున్నది!

నళి - అమ్మా, నే నెఱుఁగను.

కురం - వచ్చి నన్నుఁ గౌఁగిలింపుము.

నళి - అమ్మా, అట్లె. (కౌఁగిలించుకొనును)

కురం - ఓసీ, నీశరీర మతిశీతల మై మనోహరముగా నున్నది.

నళి - మీ దయ.

కురం - ఓసీ, ఇప్పుడు నాశరీరదాహము నశించు నట్లున్నది. (తనలో) సఖీప్రణయమైనది; నీశరీరసంసర్గ మింతతో ముగిసె! (ప్రకాశముగా) నీ విఁకఁ బొమ్ము.

నళి - చిత్తము. (నిష్క్రమించును)

హరి - భర్తృదారికా, అమ్మగారి కే మని నివేదింతును?

కురం - ఇప్పుడు రోగము నిర్వర్తించి సుఖముగా నున్న దని.

హరి - నీ కెట్లు తెలియు నని యడిగినయెడల నే మని విజ్ఞాపింతును.

కురం - చక్కగా నెఱిఁగితివి; ఈ యామధవిశేషముచే నని చెప్పుము.

హారి-చిత్తము. (నిష్క్రమించును)

అవి - దీనిచే నేమి చేయఁదలచెను?

ఆ. విడుచు నీకృశాంగి వేఁడినిట్టూర్పులు
నెఱయుకన్నునీటితెరలు గప్పఁ
గలయ సారె సారెఁ బొలయంగఁ జూచెడు
నేమి సేయ నిశ్చయించెనొక్కొ!

కురం - కానీ, పైట చెఱఁగుతో నురిఁబోసికొని ప్రాణము విడచెదను. (లేచి యట్లు చేయుచు నుఱుము విని) హాం, నన్ను రక్షింపుఁడు, రక్షింపుఁడు.

అవి - సఖా, ఇఁకమీఁద నుపేక్షింపరాదు. (అంగుళీయకము నెడమప్రేలిలోఁ దగిలించుకొని) ప్రియురాలా, వెఱవకుము వెఱవకుము (అనుచుఁ గురంగిని లేపును)

కురం - (హర్షముతో) ఇది సత్యమా? మూర్ఛురాలివలె నైతి.

అవి - కాంతా, శంక వదలుము. (కౌఁగిలించుకొనును)

కురం - ఆశ్చర్యము, నాశరీరదాహ మేకక్షణమున నశించి నట్లున్నది.

అవి - ఇదియే దీనిపరిష్వంగము.

క॥ మనమునఁ బాయమి నెప్పుడు
ననుభూతంబిదియుఁ దొలి సమాగతికంటెన్
బెనుచు రసమవని పతియని
మొనఁదెగువం జయముఁగన్న పోలు పగునాకున్.

విదూ - ఎట్లేడువ నారంభించె? అతిమాత్రసంతాప మేల? లేక నేను నేడ్చెదను. ఒక్కటిమాత్రము దుర్లభము, నాకన్నులలో నీరు కాఱదు. నాతండ్రిచచ్చిననాఁడును మహా ప్రయత్నమున నేడువ నారంభించితిని. కన్నీరు వెడలదు. ఇంక వేఱసంతాపమున కేల! అట్లయినను నుత్సుకుఁడఁగాకయు నేడ్చెదను.

అవి - ఉత్ప్రహాసన మేల? స్నేహ మనునది యచ్ఛలమొకదా.

క. వసుఁగడుగోలం బాడఁగఁ
జనెఁగాక మదీయబుద్ధిఁ జాలుదె తెగడన్ ?
దనువంద కాక బుద్ధుల
నెన యగుదురె ప్రాజ్ఞు లజ్ఞు లిలఁ గార్యములన్ !

నళినిక - (ప్రవేశించి) హారిణికా, హారిణికా, ఏల ద్వారము మూయఁబడియె? అయ్యో, ద్వారనిరోధముచే వ్యసనము విడిచియున్నదని తలంచెదను; హారిణికా, హారిణికా! హా! ఛీ-అక్లై యయ్యెను.

అవి - నళినిక స్వరమువలెఁ దోఁచుచున్నది; వయస్య, ద్వారము తెఱువుము.

విదూ - చిత్రము. (తెఱచి) రా రా, అమ్మా.

నళి - హం, ఇట నెవ్వఁడీ పురుషుఁడు?

విదూ - నీవు చక్కఁగాఁ గనిపెట్టితివి! ఏమి రాజకులవిశేషము! ఇఁక నెవ్వఁడు నన్నుఁ జూచి పురుషుఁ డని చెప్పును? నే నాఁడుదానను.

అవి - నళినికా! ఇటు రమ్ము.

నళి - భర్తృదారకుఁడా యేమి! భర్తృదారక, నమస్కారము. భర్తృదారక, ఈపురుషుఁడెవ్వఁడు.

విదూ - నేను బుమరిణి యనుచేటికను.

అవి - మేము చెప్పుచుండలేదా సంతుష్టుఁడని; ఆ బ్రాహ్మణుఁడే యితఁడు.

నళి - ఆ, ఈ బ్రాహ్మణుని నగరాపణాలిందమున మున్ను చూచి యుంటిని.

విదూ - అగును, అమ్మా, యజ్ఞోపవీతముచే బ్రాహ్మణుఁడను, చీవరముచే రక్తపటుఁడ; బట్టవిడిచినచో శ్రమణకుఁడను అగుదును. అమ్మా, యిది యేమి?

నళి - భర్తృదారిక కుపస్నానము.

విదూ - ఇది యేల; ఆఁకలిగొని యేడ్చుచుండునామెకు నుప స్నానముచేఁ గార్య మేమి? పోయి శీఘ్రముగా భోజ నము తెమ్ము. నే నగ్రాసనమునఁ గూర్చుండెదను.

నళి - దుర్బ్రాహ్మణ; ఇప్పుడును భోజనమే చింతించెదవు! అవి యన్నియు నటుండ నిమ్ము; పగటివేళ ననేకపురుష రక్షిత మగురాజమార్గమున నెట్లు భర్తృదారకుఁడు ప్రవేశించెను?

అవి - నీ కంతయు సంతుష్టుఁడు చెప్పును.

నళి - ఈ బహుమాన వాక్యములతో నన్ను వదల్చుచున్నారు. కానీ, వీనింగొని చతుశ్శాలఁ బ్రవేశించి గోష్ఠీజనము తోడ వృత్తాంతము వినియెదను. రమ్ము, బ్రాహ్మణ. (అని యీడ్చును.)

విదూ - అబ్రాహ్మణ్య మబ్రాహ్మణ్యము!

కురం - ఈ బ్రాహ్మణుఁడు హాస్యగాఁడు?

అవి - వయస్య, నీవుహాస్యుఁడవే?

విదూ - ఎవరు నన్ను శ్రద్ధసేయక యిట్లు పలుకుచున్నారు? నేను హాస్యుఁడఁగాను; ఇప్పుడు నీవే హాస్యవు; నీయ వస్థ నెఱింగి యేమో చేయవలయు నని ప్రయత్నించి మేఘశబ్దమువిని సర్వముమఱచి క్రిందఁబడినదానవు.

కురం - హాం, ఇదియును వీరు చూచిరి.

నళి - యాచించెదను! ఇటు రమ్ము బ్రాహ్మణ.

విదూ - నీవు భోజనముపెట్టెడు పక్షమున వచ్చుచున్నాను. ఆగంతుకునకు భోజనదాన మిష్టమేకదా!

నళి - రమ్ము, నాయాభరణములనెల్ల నిచ్చెదను.

విదూ - నే యనుమాటచేఁ జిత్తము శమింపదు; నా చేతిలో నుంచుము.

నళి - అట్లు కానిమ్ము (ఆభరణములు దీసి యిచ్చును)

విదూ - వినుము, అమ్మా.

నళి - మూఢబ్రాహ్మణ, చతుశ్శాలలోఁ గూర్చుండి గోష్ఠీ జనముతోడ వినియెదను.

విదూ - అట్లయిన నమ్మగారి నడిగివచ్చెదను.

నళి - నీ వెవఁడవు, నాసొమ్ములన్నియుఁ బుచ్చుకొని వల్లభుఁడ వయితివి. పద (విదూషకుని చేయిపట్టి యీడ్చును)

విదూ - అమ్మా, ఇది వలదు, వలదు, నే నతిసుకుమారుఁడను గదా!

నళి - నీ సౌకుమార్యము నే నెఱుఁగుదును, సుకుమారుఁడ వై తేని శీఘ్రముగా రమ్ము.

విదూ - అమ్మా, ఇదె యిదె వచ్చుచున్నాను. (నిష్క్రమింతురు)

అవి - ప్రియురాలా! చూడు, చూడు. పరమ దర్శనీయము లై ప్రావృట్కాలవల్లభము లగు కాలమేఘములను; ఇవియే—

సీ. పలురూపవేష్టల జలదాగమముఁ జాటు
జంభకాస్యము లైన శక్రునెడ్లు
తారకాశుద్ధాంత తరుణుల యవనికల్
గగనమార్గారూఢ గాఢనిశలు
విద్యుదహిస్త్రీ నివేశవల్మీకముల్
కుపితాంగనాసంధి గూఢచరులు
మన్మథాస్త్రనిశాన మణిశైలములు కుల
క్షోణీధరస్నాన కుంభఘటులు
నిమ్నగావల్లభుని చేత నీటిభిక్షఁ
జేసి జీవింపనేర్చు సన్న్యాసిగణము
భర్గుఁ జంద్రుని నిలుపోపు సర్గళంబు
లమరయంత్రప్రపలు వోల్చు నంబుదములు

కురంగి - ఆర్యపుత్ర, ఇప్పుడు చాల దర్శనీయ మై యున్నది!

అవి - అహో, జలధార లెంత విరలముగాను విపులముగాను బడుచున్నవి; అల్లె,

చ. చదలివుహార్ణవోర్మికలచందమునన్ మొరవెట్టు మేఘముల్,
పొదగొని మేఘముల్ మొలకవెట్టినయట్లొనఁబాఱు ధార, లు

స్మదదనుజాంగనాభ్రుకుటిమాడ్కి మెఱుంగులు విభ్రమించు బి
ట్టోదవె మనోజ్ఞ యౌవన పయోధరమర్దనవేళ కామినీ!

కురం - ఆర్యపుత్ర! ఇప్పుడు దేవుఁడు వర్షింప నారంభించెను!

అవి - ప్రియా, రమ్ము లోపలఁ బ్రవేశింతము.

కురం - (హర్షముతో) ఆర్యపుత్ర, చిత్తము.

(నిష్క్రమింతురు).

అవిమారకము

షష్ఠాంకము – ప్రథమరంగము

(దాది ప్రవేశించుచున్నది)

దాది - అహో! కృతాంతుని యనవస్థ! మొదట రాజకుమారి సౌవీరమహారాజుచేఁ దనకుమారుఁడు విష్ణుసేనున కడిగి వరించికొనియె ; ఇప్పు డవిదితసంభవముగా మనుష్యలోక దుర్లభాకృతిగుణ విశేషుఁ డగు నెవ్వఁడో దీనిం బొందెను. ఇఁక నిపుడు కాశిరాజు పుత్రుఁ డగుజయవర్మ యనువానిఁ దల్లియగు సుదర్శనతోఁగూడ మహామాత్యుఁడు భూతికుఁడు తోడ్తెచ్చి రాజగృహమున నిలిపెను. కాశిరాజు యజ్ఞవ్యాపారముచే స్వయముగా రాఁ డయ్యె. ఇప్పు డేమి కానున్నదో !

(వసుమిత్ర ప్రవేశించును)

వసు - అహో! సాంవత్సరికు లనువా రెంతవిషమ శీలురు ! తమనక్షత్ర విశేషమే చింతింతురుగాని కర్మగౌరవము నెఱుంగరు. ఇప్పుడ కుమారుఁడు ప్రవేశించె. ఇప్పుడ వివాహము నియోగింపఁబడియె. (పరిక్రమించి) ఏమి !

ఈజయదయేమో యాలోచించుకొనుచు నప్రసన్న ముఖముతో నుత్సుకురాలై కనఁబడుచున్నది.
జయదా, అమ్మగారు రమ్మని సెలవిచ్చిరి.

ధాత్రి - ఓసీ, ఎందునిమిత్త మని యెఱుఁగుదువా?

వసు - మఱి యే మున్నది? ఈకార్యమునఁ గర్తవ్య మాలోచించుటకే.

ధా - ఇప్పు డమ్మగారి కేమి యభిప్రాయము?

వసు - తనవంశమునఁ బుట్టిన విష్ణుసేనునవస్థ గుర్తెఱుంగ జయవర్మకుఁ గుమార్తె నీయ నొల్లకున్నది. మఱి మహారాజు సౌవీరరాజు పుత్రుఁ దెలియరాకగదా జాల సంతాపమును బొందెను.

నళినిక - (ప్రవేశించి) మనకు సర్వసంకటములును సంకేతము చేసివచ్చిన ట్లయ్యె. (పరిక్రమించి చూచి) ఏమి యిది నాతల్లి యగు వసుమిత్రతో నేమో చింతించుచున్నది. వీరి సమీపించి యసుఖవృత్తాంతము వినెదను.

వసు - ఓసీ నళినికా, ఇటురా; నీవు కంచుకిసహవాసముచేత రాజకుల వృత్తాంత మెఱుంగుదువు.

నళి - క్రొత్తవృత్తాంతము; అది చెప్పుటకే వచ్చినాను.

వసు - ఓసీ, చెప్పవే.

నళి - సౌవీరరాజామాత్యు లొకదూతతో, "మాప్రభువు మీనగరమున నపుత్త్రిదార కళత్రుఁడై ప్రచ్ఛన్నుఁడై

ప్రతివసించుచున్నాఁ డని గూఢపురుషులచే నీవృత్తాంతము ప్రభువు తెలిసి మాకుఁ బంపుదురు గాక" యని చెప్పిపంపిరి.

ఇరు - ఎట్లు ప్రచ్ఛన్నవేషుఁడై వర్తించు చున్నాఁ డని! తరువాత.—

నళి - అంత నిది యంతయు విని యాలేఖ తుదివఱకుఁ జదివి యార్యభూతికునితోడ మహారాజతని నన్వేషింపఁ బోయెను.

ధా - ఏ మగునో?

వసు - నళినికా నీవట్లయిన లోనికిఁబొమ్ము.

నళి - అమ్మ, చిత్తము.

వసు - నీవు రా, మన మమ్మగారిని జూతము.

దాది - అట్లే చేయుదము. (నిష్క్రమింతురు)

షష్ఠాంకము - ద్వితీయరంగము

(కుంతిభోజుఁడు సౌవీరరాజభూతికులును బ్రవేశింతురు)

కుంతి - వయస్య,

ఉ. నిన్నుఁ గనుంగొనంగలిగె నేఁడెమొగం బిది యేల చూచెదో
మిన్నక చిన్ననాటిచెలిమిం దలపోసి కవుంగిలింపు బి
గ్గన్నను, అప్ప వాలుపక గాదిలి నిన్నొగిఁ జూడఁ గ్రొత్తయై
చెన్నొదవించె నెయ్యమునఁజేసి చెలంగు వయస్యభావముల్.

సౌవీ - నీయిష్టముచొప్పుననే. (ఇరువురుఁ గౌఁగిలించుకొందురు)

గీ. బుద్ధి చింతాకులత్వంబుఁ బొరయునట్లు
యయ్యె నురుబాష్పగద్గద మయ్యె మాట
జాఱఁ గన్నీరు ముఖ మప్రసన్న మయ్యె
హర్ష వేళ వికార మే లయ్యెనయ్య?

సౌవీ - నీ సంగమముచే నేనును సంతోషింపకుండలేదు; మ తేమనఁ బుత్రస్నేహ మనునది చాల బలవంత మైనది.

క. ఉల్లంబులోన మరగుచు
మొల్లం బగుపుత్రశోకము భవత్ప్రియ వా
క్సల్లాపంబుల నిప్పుడు
హొల్లె కడు బాష్పరూపమున దివి కెగసెన్

కుంతి - ఎట్టి పుత్త్రగతశోక మని.

భూతి - ప్రభువునకుఁ దెలియును. సంవత్సరముగాఁ గుమారుఁడు గానఁ డయ్యె.

సౌ - పుత్త్రస్నేహమనునది బలవంత మైనది. చూడుము.—

క. అనయము నడలుదుఁ గానక
యనుపమ బలవీర్యరూపు నవిమారకు నా
తనయుఁ భవచ్చరణరజః
పునీతమౌళి యగు నేని పుణ్యుఁడ నిందున్.

భూతి - (తనలో) కుమారుని గానక యితనిసంతాపము పెద్దయుఁ బెరుగుచునే యున్నది. దీనిని మఱపించెదను. (ప్రకాశముగా) ప్రభువున కీయాపద యెట్లు సంభవించెను?

కుంతి - నేను నీవ్యాక్షేపముచే నిది యడుగ మఱచితిని.

సౌవీ - వినుఁడు; లేక భూతికుఁ డెఱింగియుండునేమో! అయి
నను నానోట వినఁగోరెడిఁగాబోలు.

కుంతి - మేమును విన నవహితులము.

సౌ - ఎల్లరకు విదితుఁడేకదా చండభార్గవుఁ డను నత్యంత
రోషి యగు బ్రహ్మర్షి.

కుం - అగు నట్టితపోనిధిని వినియున్నాఁడను.

సౌ - అతఁడు మాదేశమునకు వచ్చియుండెను. అరణ్యమున
నతనిశిష్యుని బులి యడ్డగించి చంపెను.

కుంతి - తరువాత,

సౌ - అంత నేను నప్పుడ మృగయావశంబున యదృచ్ఛగా
నా ప్రదేశమునకు వచ్చితిని.

కుంతి - తరువాత,

సౌ - అంత నన్నుఁ జూచి రోషము విజృంభింపఁగా బొమ్మ
ముడిచే భయంకర మగు మొగముతో జడలు వ్రేలాడు
చుండ శిష్యునిపైఁ జే యుంచి క్రోధాగ్నిచే మండుచు
నామాటలు విన నొల్లక సంరంభస్ఖలితవచనుఁ డై
నన్నుఁ బలువిధములఁ దిట్టఁదొడఁగెను.

కుంతి - తరువాత,

సౌ - అంత నేనును భవితవ్యార్థప్రాబల్యముచే ధైర్యము
వాసి "వృత్తాంతము చెప్పవు; నిష్కారణముగాఁదిట్టె
దవు" అని కోపముతో నడిగితిని.

క. చెప్పవు వృత్తము రోషము
గుప్పెదకారణము చూడ్కిఁ గురిసెను నిప్పుల్
దప్పితివి తపసితపమున
మెప్పెదు బ్రహ్మర్షి రూపమున మాలఁడ వై

కుంతి - నీవు చెప్పరానిది చెప్పితివి.

సౌవీ - అంత దాని విని యాజ్యధారచేఁ దడిసినహుతాశను నింబోలె నేత్రములు మండుచుండ మాటిమాటికిఁదల యూఁచుచుఁ "ఎట్టెట్లు" అని చెప్పుచునన్ను శపింపఁ దొడఁగెను.

క. ఎట్టు నను బ్రహ్మఋషి యని
మట్టునఁ దలపెట్ట కీవు మాలం డని వే
తిట్టితి వట్టె భజింపుము
పెట్టున మాలతన మాలుబిడ్డలతోడన్?

కుంతి - అహో, కారణ మెంతయుల్పము, అనర్థ మెంత పెద్దది!

భూతి - సౌవీరరాజకులము సభాగ్య మయ్యె; ఏలనఁగా,

క. కోపించి మాలతనమున్
శాపించెంగాక యట్టె సర్వము భస్మ
వ్యాపాదితంబు సేయక
పాపెం బ్రహ్మర్షి యిదియు భాగ్యము కాదే?

కుంతి - మీరు చక్కఁగా సూచించితిరి! తరువాత, తరువాత.

సౌవీ - తరువాత నాశాపమున మనస్సు కలంగి యతనిఁ గొంత తడ వనునయింప నల్లనల్లన ప్రకృతిస్థుఁడై నా కిట్లని యనుగ్రహించె.

క. ఒకవత్సరంబు కడసనఁ
ప్రకటింపక క్రొత్తరూపుఁ బ్రచ్ఛన్నుఁడ వై
యొకభంగి నేఁడు గడపిన
సకలశ్రీ లంది మనుదు శాపము వాయన్.

అని యిట్లు చెప్పి ప్రసన్నచిత్తుఁడై "ఓ కాశ్యప! లేచిరా" అని పిలిచెను. వ్యాఘ్రము చంపినయావటువు నతనివెంట నంటెను. నేను నొకవత్సరము చండాలవ్రత మనుచరించితిని; నేఁడు శాపమువలన విముక్తుఁడ నైతి.

కుంతి - అహో ! ప్రవృత్తినివృత్తు లెంత విపత్కారణములు! శుభముగా వర్ధిల్లుము.

భూతి - జయము స్వామి.

కుంతి - విష్ణుసేనునితల్లి పరివారముతో నంతఃపురముఁ జొచ్చెను.

భూతి - అచ్చట నాయమ లోనప్రవేశించి చిరకాలముగా నిద్రించిన ప్రణయమును మేల్కొనుపుచున్నది.

కుంతి - ఇఁక నిప్పుడు విష్ణుసేనుఁ డవిమారకుఁ డెట్లయ్యెను?

భూతి - వినుఁడు స్వామి, ధూమకేతు వనురాక్షసుఁ డుండెను. సకలలోకములఁ జంపుటకుఁ బరిభ్రమించుచు వాఁ డొకానొకప్పుడు సౌవీరరాష్ట్రమును బాధసేయఁ దలపెట్టెను!

కుంతి - కథ యపూర్వమైనది. తరువాత !

భూతి - తరువాతఁ దనదేశమున సర్వప్రజలయార్తిం జూచి యారాక్షసునకుఁ బ్రతిక్రియ వెదకఁజాలక స్వామి క్లేశమును బొందెను.

కుంతి - తరువాత,

భూతి - తరువాత దానినెల్ల నెఱింగి కుమారుఁడు విష్ణుసేనుఁడు క్షితిరేణుపరుషగాత్రుఁడు, కాకపక్షములు వ్రేలాడుచుండఁ, దుల్యవయస్కు లగుశిశువులతోఁ నాడుచుండి దైవికముగా రక్షిపురుషు లేమఱియున్న వేళ రాక్షసుఁ డున్నప్రదేశమునకు వేగముగాఁ జనియె.

కుంతి - అహో, ఎంతయాశ్చర్య మెంతయాశ్చర్యము! తరువాత!

భూతి - తరువాత నా రాక్షసుఁడు ప్రీతితోఁ జక్కఁగా నోడఁ గూడిన యాహారమువలెఁ గుమారుని మొగమెత్తి చూచి తనకార్య మొనర్చుకొనుచుండెను.

కుంతి - అహో, రాక్షసున కెంతనృశంసత! తరువాత,

భూతి - తరువాత, పిల్లవాఁడు నించుక నవ్వి,

క. పిడుగువడి గిరులఁ జీల్చెడు
వడువున దవవహ్ని నెఱసి వనదేశముఁ గా
ల్చెడునట్లు పోర నీచుని
బడవైచె నిరాయుధుండు బాలుఁడు లీలన్

కుంతి - నేను మొదటనే హస్తిసంభ్రమమునాఁడతఁడు దైవమువలనఁ బుట్టియుండునుగాని కేవలము మనుష్యుఁడు గాఁడని చెప్పియుంటిని.

సౌవీ - మీరు సహస్రనేత్రులుగదా, అవిమారకుని గుఱించి చారులతో నెట్లాలోచించితిరి?

భూతి - స్వామి!

క. చోరఁగలుగుచోటు లెల్లను
బరికించిరి చరులు పట్టువడఁడు కుమారుం
డరయఁగ మాయారూపము
ధరియింపఁగఁబోలు వెదకఁదగు నని తలఁతుఁన్.

(నారదుఁడు ప్రవేశించును.)

నారదుఁడు-

శా॥ వేదంబుల్ వినిపించి తండ్రికి ముదావేశంబు గావింతు, సం
మోదాబ్ధిన్ హరిఁ దేల్చి ముత్పులకలం బొందింతు గీతాళి న
త్పాదింతున్ మధురస్వరంబు లెలమిం దంత్రీప్రతానంబులన్
భేదంబుల్ జనులం దివానిశము గల్పింతున్ బహూపాయతన్.

అహో! కుంతిభోజునితండ్రి దుర్యోధనుఁడు మమ్మ్ముఁ జిరకాల మారాధించెను. అమానుషస్వభావము పొందినప్పుడును మాయందుఁ గుంతిభోజుఁడు భృత్యభావమె చూపును. ఇప్పుడు కుంతిభోజసౌవీరరాజుల కవిమారకుఁడు గానరామిఁ గార్యసంకట మగుచున్నది. కావున నిప్పు డవిమారకుం జూపి వారిమనఃక్లేశమును బాపెద నని మర్త్యలోకమునకు డిగితిని.

(అని కుంతిభోజసౌవీరరాజులయెదుట నిలుచును)

కుంతి - అదె, భగవంతుఁడు దేవర్షినారదుఁడు! దేవ! నమస్కారము.

నార - స్వస్తి భవతే.

కుంతి - అనుగ్రహము.

సౌవీ - దేవ, నమస్కారము.

నార - శాంతి రస్తు తే

సౌవీ - అనుగ్రహము.

కుంతి - (చెవిలో) భూతిక, ఇట్లు చేయుము.

భూతి - చిత్తము, స్వామి. (నిష్క్రమించి-ప్రవేశించి) ఇవె యర్ఘ్యపాద్యములు.

కుంతి - దేవ! అనుగ్రహింపుఁడు.

నార - అట్లె కానిమ్ము.

కుంతి - (అభ్యర్చించి) దేవ, భవదవతరణమున మాగృహము పరిపూత మయ్యె.

సౌవీ - ఇప్పుడు దేవర్షిదర్శనముచే నాశాపము తొలఁగినది.

నార - నే నిప్పుడు మీదర్శనార్థము మాత్రమే వచ్చినవాఁడఁ గాను, అవిమారకుఁడు గానరాక మీయిరువురకుఁ గలిగిన దుఃఖము నెఱింగి డిగివచ్చితిని.

ఇరువు - అట్లయినయెడల మాసంతాపములు పోయినవి!

నార - భూతిక, సుదర్శనం బిలువుము.

భూతి - చిత్తము, దేవ. (నిష్క్రమించి సుదర్శనతోఁగూడఁ బ్రవేశించును)

సుద - దేవర్షి వచ్చెఁగదా!

భూతి - అట్లె.

సుద - ఇప్పుడ నాపుత్రకునకుఁ ద్వరలో వివాహము సంఘటించెను. దేవ, మ్రొక్కుచున్నాను.

నార-

క. అది యట్లయ్యెడు మెప్పుడు
నాదవు మహాభాగ నీకు నల్లపుఁగోర్కుల్
ముద మలరఁ గుంతిభోజుం
డదరని నీప్రేమ నోలలాడెడుఁ గాతఁ!

సుద - అనుగ్రహము.

నార - ఇప్పుడు మీ రడుగఁదగిన యంశము నడుగుఁడు.

ఇరు - అనుగ్రహము.

కుంతి - దేవ, సౌవీరరాజపుత్రుఁడు బ్రదికియున్నాఁడా?

నార - గట్టిగా.

సౌవీ - ఏకారణముచే నగపడఁడు?

నార - వివాహవ్యాక్షేపమున.

సౌవీ - కుమారుఁ డెట్లు మన సిచ్చెను?

కుంతి - అంత నేప్రదేశమున?

నార - వైరంత్యనగరమున.

కుంతి - వైరంత్య మనునగరమును నున్నదనియా! కానిమ్ము, ఎవ్వని కల్లుఁ డయ్యెను!

నార - కుంతిభోజునకు.

కుంతి - అతఁ డెవ్వఁడు?

నార-

ఆ. ఇక్కురంగితండ్రి యెన్నంగ వైరంత్య
పురవరేశ్వరుండు భూవరుండు
వీర్యమానయుతుఁడు దుర్యోధనునికన్న
కొడుక వైననీవ కుంతిభోజ!

కుంతి - వేయుఁబ్రశ్నము లేల, నాకుమారి కురంగికై వలచె
నని దేవరవారు సెల విచ్చితిరి.

నార - అగునల్లె.

కుంతి - నాకు సిగ్గయిన ట్లున్నది. ఎవ్వ రిచ్చిరి? ఎట్లు?
కన్యాపుర మతఁ డెట్లుచొచ్చె ?

నార-

క. తొలుత విధి యిచ్చెఁ దొయ్యలిఁ
జెలువుఁడు గజసంభ్రమమునఁ జిత్తం బలరన్
దిలకించె మొదటఁ బౌరుష
మలవడ మాయాబలమున నవ్వలఁ జొచ్చెన్.

కుంతి - అట్ల యగుఁగాక; ఋషివచనమునకుఁ బ్రతివచనము
గలదా? దేవ, ఇప్పుడు కుమారునకును గురంగికిని
బ్రాప్తకాలమా యేమి? మొదట వివాహము ప్రారం
భించి యుండవలసె.

నార - స్వసమయముననే వారలకు గాంధర్వ వివాహము
నడచెఁగదా! ఇప్పుడు,——

కుంతి - అగ్నిసాక్షికముగాఁ గోరెదను.

నార - నిత్య మగ్ని సాక్షికముగానే! అట్లయినను స్వజనపరి
తోషణార్థ మభ్యంతర సమయమాత్ర ముపాధ్యాయు
నిచే జరిపించి త్వరగాఁ గుమారుని భార్యతోఁ దోడ్తేర
నిండు.

కుంతి - దేవ, ఇదె పోవుచున్నాను.

నార - నిలుఁడు ; భూతిక ! నీవు పొమ్ము.

భూతి - దేవ, చిత్తము. (నిష్క్రమించును.)

కుంతి - దేవ, ఒక్కవిన్నపము,

నార - ఇటు రండు ; స్వేచ్ఛగా సెలవిండు.

కుంతి - దేవ, సుదర్శనాపుత్రుఁడు జయవర్మకు మాకురంగి నిచ్చెద మని యామెఁ బెనిమిటితో నిచటికిఁ బిలిపించితిమి ; ఇప్పు డేమి చేయఁజనునో చెప్పుఁడు.

నార - (తనలో) ఇట్లొనర్చెదను (ప్రకాశముగా) ముహూర్త మేకాంతమున నుండుము.

కుంతి - అట్ల యగుఁగాక. (అట్లు చేయుచున్నాఁడు)

నార - సుదర్శనా, యిటు రమ్ము.

సుద - దేవ, ఇదె యున్నాను.

నార - మామాటలు నీకు వినవచ్చెనా ?

సుద - సౌవీరరాజపుత్రుని గుణసంకీర్తనమును వింటిని.

నార - వలదు ! ఇది వలదు ; నీ కగ్ని దేవునివలన నతఁడు జ్యేష్ఠపుత్రుఁ డై జన్మించె నని మఱచితివా ?

సుద - హాం, ఇదియు దేవర కెఱుక యయ్యెనా ?

నార - నా కాజ్ఞ యిమ్ము.

సుద - (తనలో) ఇట్లు చేసెదను. దేవా, చెప్పుఁడు.

నార - ఈకుమారుఁడు నీకు నగ్నికిని బ్రభవించెను. నీ తోఁ బుట్టు సుచేతన ప్రసవింపఁగానే యక్కుమారుఁడు స్వర్గము పొందెను. నీవు నీపుత్రుని నీసోదరి కిచ్చితివి.

ఈసౌవీరరాజును జాల సంతుష్టుఁడై ప్రీతికిఁ దగిన క్రియలు నడపి విష్ణుసేనుఁ డనునామము నిడియె. అమానుష స్వరూపబలవీర్యపరాక్రమములతో వీఁడు పెరుగుచు, నవి రూపధారి యగురాక్షసుని సంహరించినందున నవిమారకుఁ డని విష్ణుసేనుని లోకము పేర్కొనుచుండును. అంత నతఁడును బ్రహ్మశాపపరిభ్రష్టుఁడై హస్తి సంభ్రమదివసమునఁ గురంగిం జూచి మదనాభిలాషము కలిగి పెద్దపౌరుషముతోఁ గన్యాపురముఁ జొచ్చి సంగమించి కురంగిం జూచి శంకించిన కన్యాపురరక్షులచేఁ బరీక్షింపఁబడి యగ్నిభగవానుఁడు తన్ను మఱుగు సేయఁగా నంతఃపురము వెల్వడి వచ్చెను. ఆనిర్వేదముచే నగ్నిఁ జొచ్చి తండ్రి యగు నగ్నిభగవానుఁడు ప్రీతిచేఁ గౌఁగిలించుకొనఁగా నగ్ని దన్నుఁ గాల్ప నొల్లఁడని మరుత్ప్రపాతముకొఱ కొకానొక పర్వత మెక్కెను.

సుద - అహో, ఎంతయాశ్చర్యము!

నార - అచ్చట నెవ్వఁడో యొక విద్యాధరుఁడు వానిరూపముఁ గనుంగొన్న మాత్రము హర్షించి ప్రీతితో నంతర్ధానకార్యమాత్ర మగు నుంగుర మొసంగెను. దానిఁ గుడిబ్రేల ధరించిన నదృశ్యుఁడగును, ఎడబ్రేల సహజముగా నగును.

సుద - ఆశ్చర్య మాశ్చర్యము.

నార - అంత దానిఁ గుడిబ్రేల ధరించి సంతుష్టుఁ డనుబ్రాహ్మణునితోఁ గుంతిభోజకన్యాపురముఁ దనయింటిం

బలెఁ జొచ్చి కురంగితో యథేష్టముగాఁ గ్రీడించుచు సుఖమున్నాఁడు. ఇదియే వృత్తాంతము. ఇఁకఁ జేయఁ దగిన దేమి?

సుద - తరువాత, ఆపూజ్యురాలు మోసపోయినందున నా హృదయము సంచలించుచున్నది; కౌతూహలముచే సంతోషపడి యున్నది. దేవ, ఇన్ని దినములు కురంగిని జయవర్మభార్య యని పలుకుచుంటిమి. నేఁటిమొదలు వాని కామె వందనీయ యయ్యె.

నార - అభిజనులు చెప్పఁదగినరీతి సెల విచ్చితివి. అన్నభార్య నెట్లు తమ్ముఁన కొనఁగుట? సుదర్శనా, కాశిరా జైన జయవర్మతో జయవర్మకంటెఁ గురంగి వయస్సునఁ బెద్దది యని చెప్పుము. కురంగికంటెఁ జిన్నది సుమిత్ర యనునది యున్నదిగదా; అది జయవర్మకు భార్య యగుఁగాక.

సుద - ఋషివచనము ప్రతిగ్రహించితిని.

నార - పోయి కుంతిభోజు ననువర్తింపుము.

సుద - చిత్తము, దేవా.

(వరవేషముతో నవిమారకుఁడును గురంగియు భూతికుఁడును బ్రవేశింతురు).

అవి - అయ్యో, ఈవృత్తాంతముచే లజ్జితునివలె నైతి.

క. అప్పుడు గజసంభ్రమమున
మెప్పుగ ననుఁ జూచి కడిమి మెచ్చినవారే
యిప్పగిది వృత్త మరసినఁ
దప్పనినాచరిత యకట! తలఁపఁగ నయ్యో.

(పరిక్రమించి చూచి) ఆహా, ఇడె భగవంతుఁడు నారదుఁడు; ఇతఁడు,

గీ. శాపమునఁ బ్రసాదంబుల సక్తబుద్ధి
గానముల వేదముల రక్తకంఠుఁ డరయఁ
బూని మిత్రుల వైరంబు వోలయఁ జేసి
యమర సాధించు నష్టకార్యముల మరల.

కుంతి - ఇటు, ఇటు, కుమార, మనకులదైవ మగు దేవర్షికి నమస్కరింపుము.

అవి - దేవా, నమస్కారము.

నార - సపత్నీకునకు నీకు మే లగుఁగాక!

అవి - అనుగ్రహము; మామ, నమస్కారము.

కుంతి - లేలెమ్ము వత్స!

క. క్షమచే గెలువుము విప్రో
త్తముల, నిజాశ్రితుల గెలువు దయచేతఁ, బరా
క్రమమున గెలువుము రాజుల,
నమలిన మగుతత్త్వబుద్ధి నాత్మ గెలువుమా.

అవి - అనుగ్రహము.

కుంతి - వత్స! ఇటు, ఇటు తండ్రికి నమస్కరింపుము.

అవి - నాయన! నమస్కారము.

సౌవీ - లేలెమ్ము వత్స.

క. వరవేషదర్శనీయుఁడు
గురుపదవందనమనోజ్ఞకుతుకాస్యుఁడు నీ
కరణిఁ దనయుండు మ్రొక్కఁగఁ
బరఁగుము నాయట్ల హర్షబాష్పాక్షుఁడవై.

పుత్రి! మామకు నమస్కరింపుము.

అవి - మామ, నమస్కారము.

కుంతి - లేలెమ్ము, వత్స.

చ. వెలయుము మంగళాధ్వరపవిత్రుఁడవై హరివోలె నిచ్చలున్
పొలుపును నేర్మిబం జైరఘువోలె దృఢవ్రత సత్యనిష్ఠ న
ర్థుల కడ లేక యిచ్చి పితృతుల్యుఁడవై నెగడొందు మాత్మ ని
శ్చలబలవిక్రమైకసదృశంబుగఁ బేర్మి మెలంగు మెయ్యెడన్.

సొఫీ - పుత్ర, సుదర్శనకు మ్రొక్కుము.

కుంతి - సుచేతనకు నమస్కరింపక సుదర్శనకు మ్రొక్కుట యయుక్తమువలె నున్నది.

నార - కారణము గలదు ; సుదర్శనకు మ్రొక్కుము.

ఇరు - అట్లు చేయుదు.

అవి - అమ్మ, నమస్కరించుచున్నాను.

సుద - పుత్ర, ఈమెతోఁగూడఁ జిరంజీవి వగుము; (ఆలింగనము చేసికొని - తనలో) చిరకాలమునకుఁ జూచితిని ; నేఁడ నేను పుత్రసంప త్తిరసము ననుభవించితిని. (ఏడ్చును)

కుంతి - ఈ సుదర్శన.

ఉ. తొంగలిఱెప్పలం దొలఁకుతోయకణంబులతోడఁ జూడఁగా
ముంగలఁ బాలుకోరికలపొంగున నెవ్వలిచన్ను దోయిటం
బొంగి తలంకఁ బాలు తనపుత్త్రున కువ్విళులూరు నీమెయే
జెంగినతల్లి యయ్యెడు, సుచేతన దాదియమాత్ర చూడఁగన్

నార - ఏల యతిస్నేహము ? సుచేతన సుచేతనయు, సుదర్శన సుదర్శనయు, భార్యతోడికుమారుండు నంతఃపురముఁ జొత్తురుగాక.

కుంతి - చిత్తము, దేవ.

సుద - చిత్తము, దేవ!

నార - కొన్నాళ్ళలోనే సౌవీరరాజు స్వదేశమునకుఁబోనిష్టు కాశిరాజగు జయవర్మకు సుమిత్ర నిచ్చి నీవును సన్నిహితుఁడ వగుము.

కుంతి - అనుగ్రహము.

నార - కుంతిభోజ, నీకు మఱివేఱ ప్రియ మేమి చేయుదును!

కుంతి - దేవ, నాకుఁ బ్రసన్నులరేని యింతకంటె నే నెక్కుడేమి గోరఁబోయెదను.

క. సతతము గోబ్రాహ్మణులకు
హిత మెసఁగెడుఁ జెలఁగుఁ బ్రజల కెల్లసుఖంబుల్

నార - సౌవీరరాజ, నీ కేమి యధికముగాఁ బ్రియ మొనర్తును!

సౌవీ - నాకుఁ బ్రసన్నులరేని యింతకంటె నెక్కుడేమి గోరుదును ?

ధృతి నేలుమానరేంద్రుఁడు
చతురబ్ధివినీలవసన జగతిం బ్రీతిన్.
(అందఱు నిష్క్రమింతురు)

షష్ఠాంకము.

అవిమారకము ముగిసెను.

క. పరిధావినామసంవ
త్సర భాద్రపదంబులోన శుయపక్షమునం
స్థిరవారమునఁ ద్రయోదశి
విరచించెన్ రామకృష్ణవిబుధుఁడు దీనిన్.

THE INDIA PRINTING WORKS, MADRAS.